

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 30-05-2025 | సంపుటి - 24 | సంచిక - 27 | రూ : 4 | పేజీలు: 8




## యుద్ధ సన్నద్ధతకు అఖిలపక్షం..

# కాల్పుల విరమణ ఏకపక్షమా?

- దేశ ప్రజల ఆవేశంపై నీళ్లు చల్లారు
- 140 కోట్లమంది ఆత్మగౌరవాన్ని ట్రంప్‌నకు తాకట్టుపెట్టిన ప్రధాని మోదీ
- యుద్ధవ్యూహం తెలియకపోతే ఇందిరమ్మకు దండంపెట్టి బయలుదేరాల్సింది
- రాహుల్‌గాంధీ ప్రధానిగా ఉండుంటే పాక్ ఆక్రమిత కశ్మీర్ భారత్‌లో విలీనమయ్యేది
- 'జైహింద్' సభలో ప్రధాని మోదీ, భాజపాపై నిప్పులు చెరిగిన సీఎం రేవంత్‌రెడ్డి

**మే 29, హైదరాబాద్:** ''పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు అమాయకుల ప్రాణాలు తీసిన ప్పుడు యుద్ధ సన్నద్ధత కోసం అఖిలపక్షాన్ని పిలిచారు. నాలుగురోజులు యుద్ధం చేశాక.. ప్రధాని మోదీ ఏకపక్షంగా కాల్పుల విరమణను ప్రకటించారు. వీర జవాన్లు, దేశప్రజలు పాకిస్థాన్‌ను అంతం చేయాలన్న కసితో రగిలిపోతుండగా.. వారి ఆవేశంపై నీళ్లు చల్లారు.. 140 కోట్ల మంది భారతీయుల

తరువాయి 2లో

# వైకుంఠపాళి మనకొద్దు...



- ఒకసారి ఎక్కడం, మళ్లీ పడడం, మళ్లీ ఎక్కడం, మళ్లీ పడడం.. ఇలా అయితే అభివృద్ధి సాధ్యం కాదు
- 2019లో ఓడిపోవడం వల్ల ఎన్నో పనులు ఆగిపోయాయి.. మళ్లీ ఆ పరిస్థితి రావొద్దు
- జూన్ 12లోగా రాయలసీమ స్టీల్స్ పనులు ప్రారంభం
- గాలేరు-నగరిని కడపకు తెచ్చేందుకు రూ.1,000 కోట్లు
- కడప భారీ బహిరంగసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**మే 29, కడప:** అభివృద్ధి వైకుంఠపాళి కాకూడదని, మంచి పాలన కొనసాగాలని, ఒకసారి ఎక్కడం, మళ్లీ కింద పడటం, మళ్లీ ఎక్కడం, మళ్లీ కింద పడడం వంటి ఆట ఆంధ్రప్రదేశ్‌కు వద్దని తెదేపా జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు సూచించారు. 2019లో తెదేపా ప్రభుత్వం అధికారంలోకి వస్తే అభివృద్ధి కొనసాగేదని, అనుకున్న పనులన్నీ అయ్యేవని అన్నారు. ఆర్థిక ఉగ్రవాదులు రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని, వారి గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తానని హెచ్చరించారు. రాయలసీమను రాష్ట్రానికి మణిహారంగా మార్చేందుకు రాయలసీమ మిషన్ అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. దేవుని కడపలో తెదేపా మహానాడు ముగింపు సందర్భంగా నిర్వహించిన భారీ బహిరంగసభలో గురువారం ఆయన మాట్లాడారు. తామేం చేసేదీ స్పష్టంగా వివరించారు. 'ఏ పాలకుడు మంచి చేస్తాడో, ఏ పార్టీ మంచి చేస్తుందో ప్రజలు ఆలోచించాలి. 2019లో రాష్ట్రంలో తెదేపా అధికారంలోకి రాకపోవడంతో ఎంత

తరువాయి 2లో



# భక్తుల లెక్క.. ఇక పక్కా!

- తిరుమలలో క్యూలైన్‌లోని భక్తులను ఎప్పటికప్పుడు లెక్కించే ఏర్పాట్లు చేస్తున్న తితిదే

2లో

## ముష్కరులను ఎగదోస్తే

# ఉగ్ర నరసింహావతారమే



- ఇప్పటికే మూడుసార్లు మన సైనికశక్తి రుచిచూపించాం
- పాక్‌ను ఉద్దేశించి ప్రధాని మోదీ వ్యాఖ్యలు

అలీపుర్‌ద్వార్: ఉగ్రవాదుల్ని పెంచి పోషించి పొరుగుదేశాలపైకి ఉసిగొలిపితే భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తుందని ప్రధాని మోదీ మరోసారి గట్టిగా హెచ్చరించారు. పశ్చిమ బెంగాల్‌లోని అలీపుర్‌ద్వార్‌లో గురువారం నిర్వహించిన

తరువాయి 2లో

# కేరళలో కుండపోత వానలతో విధ్వంసం



- అనేక ప్రాంతాల్లో నిలిచిన విద్యుత్ సరఫరా
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- ఎనిమిది జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ

2లో

## భారాసను..

# భాజపాకు అప్పగించే కుట్ర

- నేను జైల్లో ఉన్నప్పుడు ఈ ప్రతిపాదన తీసుకొచ్చారు
- అప్పుడే బలంగా వ్యతిరేకించా
- మరి ఇప్పుడెందుకు అంత బలహీనత?
- పార్టీ బలోపేతం కోసం నేను రాసిన లేఖను లీక్ చేసిందెవరు?
- నన్ను మాటలంటున్న నాయకులు.. కేసీఆర్ నీడలో పనిచేశారే తప్ప వ్యక్తిగతంగా చేసిందేముంది?
- మీడియాతో ఇష్టాగోష్ఠిలో భారాస ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

2లో



# వస్తుందో.. లేదో వీసా!

**అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.10 వేల పరిహారం**

- తాత్కాలికంగా స్లాట్లు నిలిపివేసిన అమెరికా
- ఇప్పటికే బుక్ అయిన వారికి ఇంటర్వ్యూలు యథాతథం
- ఇక నుంచి దరఖాస్తు చేసుకునే వారికే కష్టం
- విద్యార్థుల్లో ఆందోళన

**మే 29, హైదరాబాద్:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలతో ఉక్కిరిబిక్కిరవుతూ ఇప్పటికే సగం మంది భారతీయ విద్యార్థులు అమెరికా చదువులను వాయిదా వేసుకోగా.. ఎలాగోలా నెట్టుకొద్దామని సిద్ధమైన వారికీ తాజాగా మరో గండం వచ్చిపడింది. పరిస్థితులు మారతాయన్న ఆశతో కొందరు.. పార్ట్‌టైమ్ ఉద్యోగాలు అవసరం లేదని, చదువుకే ప్రాధాన్యమని మరికొందరు.. ఇలా క్లిష్టపరిస్థితుల్లో ధైర్యం చేసి అగ్రరాజ్యంలో చదువుకు సై అన్న వారిలో దాదాపు సగం మందిని వీసాల తాత్కాలిక నిలిపివేత నిర్ణయం షాక్‌కు గురిచేస్తోంది. విద్యార్థుల సామాజిక మాధ్యమ ఖాతాలను క్షుణ్నంగా పరిశీలించాలని భావిస్తున్న అమెరికా.. అందుకు అవసరమైన సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసే వరకు వీసాల బుకింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో మళ్లీ స్లాట్లు ఎప్పుడు అందుబాటులోకి తెస్తారో తెలియక విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

తరువాయి 2లో



# యుద్ధ సన్నద్ధతకు అఖిలపక్షం.. కాల్పుల విరమణ ఏకపక్షమా?

(మొదటిపేజీ తరువాయి)

ఆత్మగౌరవాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు తాకట్టుపెట్టారు. మా వల్లే యుద్ధం ఆగిందని ట్రంప్ బహిరంగంగా ప్రకటించినా ఇప్పటివరకూ ఆ వ్యాఖ్యల్ని ఖండించలేదు' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ప్రధాని మోదీ, భాజపా నేతలపై నిప్పులు చెరిగారు. 'పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను భారత్‌లో విలీనం చేయాలని, పాకిస్థాన్‌ను ప్రపంచపటం నుంచి తీసెయ్యండంటూ మోదీకి మద్దతు ఇచ్చాం. కాల్పుల విరమణపై విమర్శలు వస్తుండటంతో తిరంగా ర్యాలీ పేరుతో భాజపా నాయకులు తిరుగుతున్నారు. కాంగ్రెస్‌ను, రాహుల్ గాంధీని విమర్శిస్తున్నారు. పహల్గాంలో 26 మందిని, యుద్ధంలో 13 మంది జవాన్లను ఉగ్రవాదులు చంపేస్తే భాజపా నాయకులు, పార్టీ కార్యకర్తలు ఏం చేస్తున్నారు'' అని సీఎం నిలదీశారు. త్రివిధ దళాలకు మద్దతుగా ఏఐసీసీ ఆదేశాల మేరకు హైదరాబాద్‌లోని బాచుపల్లి పరిధి కేజీఆర్ కన్వెన్షన్‌లో పీసీసీ నిర్వహించిన 'జైహింద్' ర్యాలీ, సభకు ఆయన గురువారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యుద్ధవిరమణను ఏకపక్షంగా ప్రకటించిన ప్రధాని మోదీ తాను, తన ప్రభుత్వం విజయం సాధించామంటూ దేశవ్యాప్తంగా తిరంగా ర్యాలీలు నిర్వహిస్తున్నారంటూ విమర్శించారు. దేశ సమగ్రత కోసం తమ నాయకులు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జునఖర్గేలు రాజకీయాలకు అతీతంగా మద్దతు ప్రకటిస్తే.. మోదీ వారిపై రాజకీయ విమర్శలు చేస్తున్నారన్నారు. ఈ సమయంలో రాహుల్ ప్రధానిగా ఉంటే.. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను భారత్‌లో విలీనం చేసేవారని, చైనాను నియంత్రించేవారని పేర్కొన్నారు. ఎప్పుడు ఎన్నికలొచ్చినా రాహుల్‌గాంధీని ప్రధానిగా గెలిపించేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని రేవంత్ పిలుపునిచ్చారు.

*** గుండెల్లో ధైర్యం.. నిటారైన వెన్నెముక ఉండాలి**

''దేశ సమగ్రతను దెబ్బతీసేందుకు పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు పహల్గాంలో 26 మంది అమాయకులను కాల్చిచంపారు. నాలుగురోజులు యుద్ధం చేశాక ప్రధాని మోదీ కాల్పుల విరమణ అన్నారు. ఈ ప్రకటన వెనుక ఎవరున్నారో? ఎవరినెవరు లొంగదీసుకున్నారో తెలియదు.. పాకిస్థాన్ జరిపిన కాల్పుల్లో రఫేల్ యుద్ధ విమానాలు ఎన్ని నేలకూలాయో చెప్పండి.. పీఓకేను గుంజుకోవద్దని మీకు ఎవరైనా చెప్పారా? పాకిస్థాన్‌ను హెచ్చరించే ధైర్యం లేదు.. బలోచిస్థాన్‌ను పాక్ నుంచి విడగొట్టే శక్తి లేదు. యుద్ధం కొనసాగించాలంటే గుండెల్లో ధైర్యం, నిటారైన వెన్నెముక ఉండాలి.. యుద్ధనీతి తెలుసుండాలి.. అది మీకు(మోదీ) తెలియకపోతే ఇందిరమ్మను తలుచుకుని.. దండం పెట్టుకొని యుద్ధాన్ని కొనసాగించండి. 1971లో పాక్‌కు వ్యతిరేకంగా యుద్ధం చేస్తే మీకు నష్టం జరుగుతుందని ఇందిరను అమెరికా అధ్యక్షుడు హెచ్చరిస్తే.. మా విషయంలో జోక్యం చేసుకోవద్దంటూ ఆమె అమెరికా గడ్డపైనే ప్రకటించారు. అంతకుముందు 1967లో చైనా భారత భూభాగాన్ని ఆక్రమించుకునేందుకు వస్తే.. పొలిమేరలు దాటేంతవరకూ తరిమి కొట్టారు. కొన్నేళ్ల క్రితం చైనా 4వేల చదరపు మీటర్ల భూభాగాన్ని ఆక్రమించుకోవడంతో పాటు తెలంగాణ బిడ్డ కర్నల్ సంతోష్‌ను కాల్చి చంపితే ఇప్పటికీ ప్రతీకారం తీర్చుకోలేదు. కాంగ్రెస్ పార్టీ దేశానికి ఏమిచ్చిందని భాజపా నాయకులు ప్రశ్నిస్తున్నారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చింది కాంగ్రెస్. దేశ ప్రజల సంక్షేమం కోసం నెహ్రూ కుటుంబం వందల కోట్ల రూపాయల ఆస్తులను తృణప్రాయంగా వదులుకుంది. దేశప్రజల మనోభావాలు తెలుసుకునేందుకు కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ 150 రోజులు రాహుల్ గాంధీ పాదయాత్ర నిర్వహించారు. సొంత ఇల్లు కూడా లేని నాయకుడు ఆయన. పహల్గాంలో ఉగ్రదాడి జరిగి నెలరోజులైనా బాధిత కుటుంబాలను కలుసుకునేందుకు మోదీ ఎందుకు వెళ్లలేదు? సైనికుల కుటుంబాలకు అండగా ఉండేందుకు రాహుల్ గాంధీ అక్కడ పర్యటించారు. మోదీ వల్ల దేశ గౌరవ ప్రతిష్ఠలు ఏమాత్రం పెరగవు'' అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# భారాసను.. భాజపాకు అప్పగించే కుట్ర

హైదరాబాద్: ''తెలంగాణ వనరులను దోచుకునే ప్రయత్నం చేస్తున్న భాజపాను కట్టడి చేయకుండా.. గంపగుత్తగా భారాసను ఆ పార్టీకి అప్పగించే ప్రయత్నం జరుగుతోందని నా భావన. నేను జైలులో ఉన్నప్పుడు ఇదే ప్రతిపాదనను నా వద్దకు తీసుకొచ్చారు. ఎట్టిపరిస్థితుల్లోనూ భారాసనే తెలంగాణకు శ్రీరామరక్ష అని చెప్పా. విలీనం చేయొద్దని ఆనాడు బలంగా కేసీఆర్‌ను కోరా. ఆరు నెలలు కాదు.. ఏడాదైనా జైలులో ఉంటా.. దయచేసి తొందరపాటు నిర్ణయం తీసుకోవద్దని ఆనాడు జైలు నుంచి వాదన వినిపించా. మరి ఇప్పుడెందుకు అంత బలహీనత? భారాసలో భాజపాకు కూడా కోవర్టులున్నట్లేనా? భాజపా నాయకులు హాస్పిటల్స్ ప్రారంభిస్తే పోయింది ఎవరు? ఈ అంశాలన్నీ మాట్లాడించాలా మరి?'' అని భారాస ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. 'నేను అడిగేది ఒక్కటే.. పార్టీ బలోపేతం కోసం రాసిన లేఖను లీక్ చేసింది ఎవరు? నా దగ్గరకు కేసీఆర్ దూతలుగా వచ్చినవారు చెప్పనటువంటి అంశాలు చెప్పినట్టుగా రాయించింది ఎవరు?' అని నిలదీశారు. 'నేను కేసీఆర్ లాగా చాలా తిక్కదాన్ని. పదవులు, పైసలు అవసరం లేదు. ఆత్మగౌరవం, ఆత్మాభిమానం కోరుకుంటా. వెన్నుపోటు రాజకీయాలు చేయను'' అని తెలిపారు. బంజారాహిల్స్‌లోని తన నివాసంలో కవిత గురువారం మీడియాతో పలు అంశాలపై ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. పరోక్షంగా భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను లక్ష్యంగా చేసుకొని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

*** కేసీఆర్‌కు నోటీసులిస్తే కార్యాచరణ ఏదీ..?**

''ప్రాణాలొడ్డి తెలంగాణను సాధించి, అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లిన కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులిస్తే.. భారాస ఏం కార్యాచరణ తీసుకుంది? రాష్ట్రస్థాయిలో నిరసన తెలపొద్దా? కేవలం 'ఎక్స్'లో సందేశాలు పెట్టి చేతులు దులుపుకొంటే బాగుంటుందా? క్షేత్రస్థాయిలో ఉద్యమాలు ఎందుకు చేయలేకపోతున్నాం? అదే మరో నాయకుడికి నోటీసులొస్తే విపరీతంగా స్పందించారు. నేను పార్టీ వ్యతిరేక కార్యాచరణ చేస్తున్నట్లు కొంతమంది పెయిడ్ సోషల్ మీడియా కార్యకర్తలతో ఇంటి ఆడబిడ్డ మీద ఎటుపడితే అటు మాట్లాడిస్తే అది మర్యాదనా? భారాస రజతోత్సవ సంబురాలు అమెరికాలో ఎందుకు? ఇక్కడ ఎందుకు చేయడం లేదు?

**ఆ రోజే రాజీనామా చేస్తాననా్న..**

దిల్లీ లిక్కర్ పాలసీ వ్యవహారంలో నా మీద ఆరోపణలు వచ్చిన రోజే.. కేసీఆర్ వద్దకు వెళ్లి.. ఎమ్మెల్సీ పదవికి, పార్టీకి రాజీనామా చేస్తానని చెప్పా. 'నన్ను ఎదుర్కొనే దమ్ము లేక.. నీ మీద కుట్రపూరితంగా కేసు పెడుతున్నారు.. రాజీనామా చేయాల్సిన అవసరం లేదు' అని కేసీఆర్ వారించారు. నన్ను జైలుకు తీసుకెళ్లే సందర్భంలోనూ.. రాజీనామా చేయమంటారా? అని మరోసారి అడిగినా అవసరం లేదన్నారు. పార్టీలో కొందరు కుట్రపూరితంగా ఎంపీగా ఓడిస్తే.. మళ్లీ నాకు నిజామాబాద్ పార్లమెంటు ఇన్‌ఛార్జిగా ఇవ్వాలని కేసీఆర్‌ను కోరా. అప్పుడు ఆయన స్పందిస్తూ.. 'ఎమ్మెల్యేలు నీకు పనిచేయలేదని నాకు లేట్‌గా తెలిసింది.. కాబట్టి నీకు అదే జిల్లాలో ప్రొటోకాల్ ఉంటే.. సరిగ్గా పనిచేయగలుగుతావు' అని చెప్పి.. పాలసీ నిర్ణయం తీసుకొని ఎమ్మెల్సీ ఇచ్చారు తప్ప.. నేను ఏనాడూ పదవుల కోసం పనిచేయలేదు.

**ఆడబిడ్డపై ప్రతాపమా?**

తెలంగాణ ఉద్యమ సమయంలో నేను కడుపులో బిడ్డను పెట్టుకొని.. సైనికురాలిలాగా పనిచేశా. వ్యక్తిగతంగా అనేక కార్యక్రమాలు చేశా. కానీ, ఇప్పుడు నన్ను రకరకాల మాటలంటున్న నాయకులు.. కేసీఆర్ నీడలో పనిచేశారే తప్ప.. వ్యక్తిగతంగా వారు చేసిన కార్యక్రమం ఏముంది? నాపై మీ పెయిడ్ ఆర్టిస్టులతో ప్రతాపం చూపిస్తే.. నేను అసలే మంచిదాన్ని కాదు. మాట్లాడడం మొదలుపెడితే బాగుండదు. ఏమన్నా అంటే నువ్వు లేఖ ఎందుకు రాశావ్? అంటున్నారు. కేసీఆర్‌కు వందల లేఖలు రాశా. మా నాన్నకు నేను రాసుకుంటా.. మీకేం నొప్పి? సాధారణంగా లేఖను చదివిన తర్వాత కేసీఆర్ చించుతారు. కానీ, ఈ సారి నా కర్మ బాగోలేదో.. ఇంకెవరి కర్మ బాగోలేదో కానీ.. ఆయన చించకుండా అలా పెట్టారు. నేను పార్టీ అధ్యక్షుడికి రాయలేదు. మా నాన్నకే రాశా. లేఖలో ఏమైనా ఒక్క అంశమైనా తప్పుందా? దేశం వెలుపల మీడియా సెల్‌లు పెట్టుకొని.. అక్కడ్నించి దొంగదెబ్బ తీస్తామనే తెలివితేటలను బయటి వాళ్ల మీద ప్రయోగించండి.

*** కేసీఆర్‌ను మోసేంత పెద్దోళ్లు అయ్యారా?**

కాంగ్రెస్ నాయకులతో కొందరు.. భాజపా నేతలతో కొందరు కలిసి ఉంటున్నారు. నాకు నీతులు చెప్పిన నాయకులు పెంచి పోషించిన పెట్టుబడిదారులు.. పార్టీకి పార్లమెంటు సభ్యులు అవసరమైనప్పుడు ఎక్కడికి పోయారు? నాయకుడిని కూడా మేమే మోస్తున్నామని కార్టూన్లు వేయించుకొని ప్రచారం చేసుకుంటారా? కేసీఆర్‌ను మోసేంత పెద్దోళ్లు అయిపోయారా? నాపై గత కొంతకాలంగా దుష్ప్రచారం చేస్తున్నా.. పార్టీ స్పందించలేదు. అదే మరో సీనియర్ నేతపై ఇలాంటి ప్రచారమే జరిగితే స్పందించారు. నాపై జరుగుతున్న దుష్ప్రచారంపై పార్టీ స్పందిస్తుందని ఆశిస్తున్నా. ఏదైనా విషయముంటే.. నేరుగా మాట్లాడాలి. మీడియాలోనే మాట్లాడుతామంటే.. నేను కూడా మీడియాలోనే మాట్లాడతా. నన్ను పార్టీ నుంచి బయటకు ఎవరు పంపుతారు? అంత సీన్ లేదు'' అని కవిత వ్యాఖ్యానించారు.

# వైకుంఠపాళి మనకొద్దు

(మొదటిపేజీ తరువాయి)

నష్టపోయామో గుర్తుపెట్టుకోవాలి. నాడు గెలిస్తే అనుకున్న పనులన్నీ పూర్తయ్యేవి. ఓడిపోవడం వల్ల రాష్ట్రం దెబ్బతింది. మంచి పాలన కొనసాగాలి. రాష్ట్రాన్ని వైకుంఠపాళి చేస్తారా? సహకరిస్తారా అని ప్రజలను అడుగుతున్నా. 2004 వరకు హైదరాబాద్‌లో చేసిన అభివృద్ధి వల్ల ఆర్థికవ్యవస్థలో దేశంలోనే తెలంగాణ మొదటిస్థానంలో నిలిచింది. మంచి పాలన చేసుకుంటూ పోతే అద్భుతాలకు వీలవుతుంది'అని అన్నారు. 'పాకిస్థాన్ అండతో ఉగ్రవాదులు మన దేశానికి వచ్చి పర్యాటకులను పొట్టన పెట్టుకున్నారు. ప్రధాని మోదీ ఆపరేషన్ సిందూర్ చేపట్టి వారిని అంతం చేయించారు. ప్రజలకు ఒక నమ్మకం వచ్చింది. ఆర్థిక ఉగ్రవాదుల వల్లా అంతే నష్టం. రాష్ట్రంలో కొందరు ఆర్థిక ఉగ్రవాదులు రాజకీయం ముసుగులో భూమి, ఇసుక, గనులు దోచేశారు. అడవులను ఆక్రమించి ఎస్టేట్లు నిర్మించుకున్నారు. కొండలు మింగేశారు. చెరువుల్ని చెరబట్టారు. అలాంటి ఆర్థిక ఉగ్రవాదుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తాం. జె బ్రాండ్‌తో నకిలీ మద్యం వ్యాపారం చేశారు. ఆ మద్యం తాగినవారికి గుండె, కిడ్నీలు, లివర్ పాడైపోయాయి. డ్రగ్స్, గంజాయి రావడంతో యువత నిర్వీర్యమైపోయింది. ఇప్పుడు ఉన్నది సీబీఎన్, ఎన్డీయే ప్రభుత్వం. ఎవరైన గంజాయి, డ్రగ్స్ అమ్మితే అదే చివరిరోజు. ఆడబిడ్డల జోలికి వస్తే అవే అంతిమ ఘడియలు' అని సీఎం హెచ్చరించారు.

ఒక మెసేజితో మీ పనులు పూర్తి

వాట్సప్ పాలనలో ఇప్పటికే 380 సేవలు తెచ్చాం. జూన్ 12 నాటికి 500 సేవలు వస్తాయి. దిల్లీలో మన పరపతి పెరగడంతో పోలవరం ప్రాజెక్టుకు రూ.12,150 కోట్లు, విశాఖ స్టీల్‌ప్లాంటుకు రూ.11,400 కోట్లు వచ్చాయి. అమరావతికి రూ.15వేల కోట్లు ఇస్తున్నారు. రైల్వేజోన్ ఏర్పాటైంది. రూ.7.50 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. భూతాన్ని భూస్థాపితం చేస్తామని హామీ ఇస్తేనే పెట్టుబడిదారులు వచ్చారు. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటుచేస్తున్నాం. విశాఖకు పలు ఐటీ, ఇతర సంస్థలు వస్తున్నాయి. యువతను పైకి తెచ్చే బాధ్యత నాదే' అని చంద్రబాబు తెలిపారు.

**రాష్ట్రానికి రాయలసీమ మణిహారం**

'రాయలసీమ అభివృద్ధికి స్పష్టమైన బ్లూ ప్రింట్ ఉంది. ఆ మిషన్‌తో సీమను రాష్ట్రానికి మణిహారంగా మారుస్తా. తిరుపతిలో ఐఐటీ, ఐసర్, ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్, సంస్కృత యూనివర్సిటీ ఏర్పాటవుతున్నాయి. కర్నూలులో ఉర్దూ యూనివర్సిటీ, ఐఐఐటీ వస్తున్నాయి. అనంతపురంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, సెంట్రల్ యూనివర్సిటీ ఏర్పాటవుతున్నాయి. కర్నూలుకు హైకోర్టు బెంచ్ తప్పకుండా వస్తుంది. ఓబుళాపురం గనుల పేరుతో వాళ్లు విదేశాలకు దొంగతనంగా ఇనుప ఖనిజం తరలించారే గానీ కడపకు స్టీల్‌ఫ్యాక్టరీ రాలేదు. జూన్ 12లోపు కడపలో రాయలసీమ స్టీల్‌ప్లాంటు పనులు ప్రారంభమవుతాయి. 3,500 మందికి ఉద్యోగాలు వస్తాయి. కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక పార్కులు రెండింటికీ రూ.5,000 కోట్లతో టెండర్లు పిలిచాం' అని చంద్రబాబు చెప్పారు.



# ముష్కరులను ఎగదోస్తే ఉగ్ర నరసింహావతారమే

(మొదటిపేజీ తరువాయి)

సభలో ఆయన ప్రసంగించారు. శత్రువును మోకాళ్లపై కూర్చోబెట్టిన 'ఆపరేషన్ సిందూర్' ఇంకా ముగియలేదని బెంగాల్ గడ్డ మీద నిలబడి, 140 కోట్ల మంది భారతీయుల తరపున ప్రకటిస్తున్నానని ప్రధాని మోదీ తెలిపారు. పహల్గాం ఉగ్రదాడిపై బెంగాల్‌లో కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తమైందని, 'సిందూర్ ఖేలా' శక్తి ఏమిటో ఈ రాష్ట్ర మహిళలకు బాగా తెలుసని పేర్కొన్నారు. దుర్గామాత పూజలో భాగంగా పశ్చిమబెంగాల్ మహిళలు సంప్రదాయబద్ధంగా 'సిందూర్ ఖేలా' నిర్వహిస్తారు. 'పహల్గాంలో మన సోదరీమణుల నుదుటి సిందూరాన్ని చెరిపివేసే దుస్సాహసానికి ముష్కరులు పాల్పడ్డారు. వారికి సిందూరం శక్తి ఏంటో మన సైన్యం రుచి చూపించింది. మనం వారి భూభాగంలోకి ప్రవేశించి మూడుసార్లు దాడులు చేశామని పాకిస్థాన్ గుర్తుంచుకోవాల'ంటూ... మెరుపు దాడులు (2016), బాలాకోట్ వైమానిక దాడులు(2019), ఇప్పటి ఆపరేషన్ సిందూర్‌ను మోదీ పరోక్షంగా ప్రస్తావించారు. ఉగ్రవాదం, ప్రజల ప్రాణాలు తీయడంలో పాకిస్థాన్ ఆర్మీ బాగా ఆరితేరిందన్నారు.

**బెంగాల్‌లో 'నిర్మమ్' సర్కార్'**

పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీని ఉద్దేశించి ప్రధాని మోదీ తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రం వరుస సంక్షోభాలతో సతమతమవుతోందన్నారు. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా కొనసాగిన నిరసనల సమయంలో ముర్షిదాబాద్, మాల్డాలో చోటుచేసుకున్న ఘర్షణలు ఆమె ప్రభుత్వ క్రూరత్వం, ఉదాసీనతకు నిదర్శనమని ధ్వజమెత్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో 'నిర్మమ్' (దయలేని) ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. 'రాష్ట్రంలో అధికార పార్టీ వ్యక్తులు కొందరి ఇళ్లను గుర్తించి తగులబెడుతుంటే పోలీసులు అడ్డుకోకుండా చూస్తూ ఉంటే.. అది ఎంతటి భయానక పరిస్థితో అర్థంచేసుకోండి. ప్రభుత్వాన్ని నడిపేది ఇలాగేనా? ఇక్కడి సర్కారుపై ప్రజలకు విశ్వాసం లేదు. దీనిని మార్చివేయాలని, సుపరిపాలన కావాలని కోరుకుంటున్నారు' అని మోదీ పేర్కొన్నారు.

**ఇదే సరైన సమాధానం**

భారత్‌లో ఉగ్రవాదాన్ని వ్యాప్తిచేసే వారికి సరైన సమాధానం ఆపరేషన్ సిందూర్ అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఉగ్రవాదంపై పోరాడేందుకు దేశం మొత్తం ఏకమైందన్నారు. సిక్కిం రాష్ట్ర హోదా పొంది 50 ఏళ్లు పూర్తైన సందర్భంగా గ్యాంగ్‌టక్‌లోని పల్జోర్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన వారిని ఉద్దేశించి వర్చువల్ విధానంలో ఆయన ప్రసంగించారు. ప్రతికూల వాతావరణం వల్ల గ్యాంగ్‌టక్‌కు రాలేకపోయినట్లు తెలిపారు.

# భక్తుల లెక్క.. ఇక పక్కా!

తిరుమల : వేసవి సెలవుల్లో తిరుమలకు పెద్దఎత్తున భక్తులు వస్తున్నారు. వారాంతంలో 90 వేలకు పైగా, మిగిలిన రోజుల్లో 70 వేల నుంచి 80 వేల మంది శ్రీవారిని దర్శించుకుంటున్నారు. గతంలో సరైన గణన లేకుండానే కంపార్ట్‌మెంట్‌కు ఇంతమంది అని ఉజ్జాయింపుగా లెక్కించేవారు. అదే సమయంలో బయట లైన్‌లో ఉన్న భక్తులకు అన్నప్రసాదాలు అందించేవారు కాదు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి సూచనల మేరకు తితిదే అదనపు ఈఓ వెంకయ్య చౌదరి క్యూ లైన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌పై దృష్టి సారించారు. దర్శనానికి వచ్చే ప్రతి ఒక్కరినీ లెక్కేసి, క్యూలో ఎంతమంది ఉన్నారో తెలుసుకొని భక్తులకు సులభ దర్శనం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నారు. క్యూలైన్‌లో ఎక్కడ భక్తులు ఎక్కువగా ఉన్నారు, ఎక్కడ ఖాళీ ఉంది అనే వివరాలను తెలుసుకుంటున్నారు. రద్దీ ప్రాంతం నుంచి ఖాళీ ఉన్నచోటుకు భక్తులను పంపి తోపులాట చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నారు. కంపార్ట్‌మెంట్లలోకి నిర్ణీత సంఖ్యలో మాత్రమే అనుమతిస్తున్నారు.

# కేరళలో కుండపోత వానలతో విధ్వంసం

తిరువనంతపురం: రుతుపవనాల కారణంగా కురుస్తున్న భారీ వర్షాలతో కేరళ అతలాకుతలం అవుతోంది. ఈ క్రమంలో భారత వాతావరణ శాఖ గురువారం రాష్ట్రంలోని పథనంథిట్ట, కొట్టాయం, ఎర్నాకుళం, ఇడుక్కి, కోజికొడ్, వయనాడ్, కన్నూర్, కాసరగోడ్ జిల్లాలకు.. రెడ్, మిగిలిన జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్రమైన అల్పపీడనం కారణంగా రాబోయే కొద్ది రోజుల్లో రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షం పడే అవకాశం ఉందని తెలిపింది. రాష్ట్రంలో భారీ వర్షాలు, గాలులతో అనేక ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో కరెంటు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా నేలకూలిన చెట్లు అనేక ఇళ్లను దెబ్బతీశాయి. అనేక ప్రాంతాల్లో పంటలు నాశనమయ్యాయి. వయనాడ్ జిల్లాలో సహా రాష్ట్రంలోని పలు ప్రాంతాల ప్రజలు సహాయ శిబిరాలకు చేరుకున్నారు. రెడ్ అలర్ట్ అంటే 24 గంటల్లో 20 సెం.మీ. కంటే భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంటుంది. ఆరెంజ్ అలర్ట్‌లో 11 సెం.మీ. నుంచి 20 సెం.మీ.ల భారీ వర్షం పడొచ్చు. ఎల్లో అంటే 6 సెం.మీ. నుంచి 11 సెం.మీ. మధ్య భారీ వర్షం.

# వస్తుందో.. లేదో వీసా!

(మొదటిపేజీ తరువాయి)

అమెరికాలో వచ్చే ఆగస్టు/సెప్టెంబరులలో తరగతులు మొదలయ్యే ఫాల్ సీజన్‌కే 90 శాతం మంది భారతీయ విద్యార్థులు వెళ్తుంటారు. అందుకు ఫిబ్రవరి, మార్చి నుంచే ఆ దేశ వర్సిటీల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకుంటారు. సీటు ఇస్తామని ఐ20 పత్రాన్ని వర్సిటీ పంపిన తర్వాత విద్యార్థులు ఎఫ్1 వీసా కోసం ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకుంటారు. 'ఓపెన్ డోర్' నివేదిక ప్రకారం 202324లో అమెరికాలోని అంతర్జాతీయ విద్యార్థుల్లో భారత్‌దే ప్రథమ స్థానం. ఏటా మన దేశం నుంచి వెళ్లే వారిలోనూ 40 వేల నుంచి 50 వేల మంది తెలుగు రాష్ట్రాల వారే ఉండేవారు. అక్రమ వలసదారులను పట్టుకొని వారి సొంత దేశాలకు పంపాలన్న లక్ష్యంతో గత జనవరి/ఫిబ్రవరి నుంచి అమెరికా దాడులు చేయడంతో పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేస్తున్న భారతీయ విద్యార్థులు వాటిని మానుకున్నారు. అక్కడ ఉద్యోగాలు బాగా తగ్గాయని అంచనాకు వచ్చి.. ఏటా వెళ్లేవారిలో 50 శాతం అమెరికా చదువును వాయిదా వేసుకున్నారు. మిగిలిన సగం మంది మాత్రం ఎలాగోలా అక్కడికి వెళ్లేందుకే మొగ్గు చూపారు. ఈ క్రమంలో ఐ20 పత్రాన్ని పొందిన విద్యార్థులు మే మొదటి వారం నుంచి వీసా తేదీని బుక్ చేసుకుంటున్నారు. మొత్తానికి ఇప్పటికే వెళ్లే వారిలో దాదాపు సగం మంది వీసా స్లాట్లను బుక్ చేసుకున్నారని నిపుణుల అంచనా. అంటే వారికి సమస్య లేదని చెబుతున్నారు. కాకపోతే వీసా తిరస్కరిస్తారేమో అన్న ఆందోళన వారిలోనూ ఉంది. అయితే, గత ఏడాదితో పోల్చుకుంటే ఈ సారి వీసా తిరస్కరణ చాలా తగ్గిందని కన్సల్టెన్సీల నిర్వాహకులు చెబుతున్నారు. 'మా కన్సల్టెన్సీ నుంచి 14 మంది వీసా కోసం వెళ్లారు. వారిలో ఒకరిది మాత్రమే తిరస్కరించారు' అని వరల్డ్ వైడ్ ఎడ్యుకేషన్ అండ్ కెరీర్స్ ఎండీ ఉడుముల వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. నిబంధనల ప్రకారం తరగతుల ప్రారంభ తేదీకి నెల రోజుల ముందు అమెరికాకు వెళ్లొచ్చని.. ఈ సారి వీసాల జారీ ఆలస్యమైతే ఆ సమయం తగ్గుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# కాలనీలలో, బస్తీలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

*** సమీక్ష సమావేశంలో బీఆర్ఎస్ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని కాలనీలలో, బస్తీలలో కొనసాగుతున్న రోడ్డు, భూగర్భ డ్రైనేజీ వంటి అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని బీఆర్ఎస్ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. గురువారం కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ జంట సర్కిళ్లయిన కుత్బుల్లాపూర్, గాజుల రామారం ఉప కమిషనర్లు, వివిధ విభాగాల అధికారులతో వివిధ డివిజన్లు, కాలనీలలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎలాంటి విపత్తులు ఎదురైనా ఎదుర్కొనేందుకు సిబ్బందిని సమాయత్తం చేస్తూ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ సిద్ధంగా ఉండాలన్నారు. జంట సర్కిళ్ల లోని బస్తీలలో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులను చేపట్టడంతో పాటు నూతన పనులకు ప్రణాళికలు రూపొందించాలన్నారు.వివిధ డివిజన్లలో అసంపూర్తిగా ఉన్న నాలా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కాలనీలలో పిల్లలు, పెద్దలకు ఆహ్లాద భరితంగా ఉన్న పార్కులను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ఓపెన్ జిమ్ ల నిర్వహణ, ప్రహరీ గోడ నిర్మాణం వంటి చర్యలు చేపట్టాలన్నారు. జంట సర్కిళ్ల పరిధిలోని శ్రీనివాస్ నగర్, కళావతి నగర్, దేవేందర్ నగర్, భగత్ సింగ్ నగర్, పద్మా నగర్ ఫేస్ 1 కాలనీలలోని స్మశాన వాటికలను ఆధునీకరించి మోడర్న్ గ్రేవ్ యార్డ్ నిర్మించాలని సూచనలు చేశారు. మోడల్ మార్కెట్లను ప్రజా అవసరాలకు ఉపయోగపడేలా 100% వినియోగించాలన్నారు. అవసరమైన చోట కమ్యూనిటీ హాల్ నిర్మాణాలను చేపట్టి ప్రజలకు అవసరమయ్యేలా చూడాలన్నారు. జగద్గిరిగుట్ట అవుట్ పోస్ట్ వద్ద ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు సిగ్నల్ లను ఏర్పాటు చేయాలన్నారు. జగద్గిరిగుట్ట చివరి బస్టాప్ లో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులలోని సిబ్బంది కోసం విశ్రాంతి గదులు, టాయిలెట్ల నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పరికి చెరువులో మురుగునీరు కలవకుండా శుద్ధికరణ చర్యలు చేపట్టి చెరువును సుందరీకరించాలన్నారు. చింతల్ డివిజన్ భగత్ సింగ్ నగర్ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్లో అసంపూర్తిగా మిగిలిపోయి ఉన్నా పనులను చేపట్టి ప్రజలకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేవాలన్నారు. సూరారం డివిజన్ టీఎస్ఐఐసీ కాలనీలోని మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సుభాష్ నగర్ డివిజన్ రాజీవ్ గృహకల్ప నుంచి ఎస్.ఆర్. నాయక్ నగర్ వరకు నాలా పనులను అటవీశాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ నిర్మించాలన్నారు. విద్యాసంస్థలు, ఆస్పత్రులు అధికంగా ఉన్న చింతల్ మెయిన్ రోడ్ లో పాదాచారులు రోడ్డు దాటేందుకు అనుగుణంగా ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను ఏర్పాటు చేయాలన్నారు. పాపయ్య యాదవ్ నగర్ నుంచి బాలానగర్ బిబిఆర్ ఆసుపత్రి వైపుగా వెళ్ళే నాలా విస్తరణ పనులను చేపట్టే విధంగా కూకట్ పల్లి సర్కిల్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులు చేపట్టాలన్నారు. తద్వారా కుత్బుల్లాపూర్ లో వరద ప్రవాహం సాఫీగా సాగుతుందని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధిని కల్పించేందుకు ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం అర్హులైన లబ్ధిదారులందరికీ అందేలా చూడాలన్నారు. ఈ పథకాన్ని నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకొనేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలనే సంకల్పంతో ఏర్పాటుచేసిన డివిజన్ వార్డు ఆఫీసులలో నిర్ణీత సమయాన్ని నిర్దేశించి అధికారులు, సిబ్బంది ఉండి ప్రజలకు సేవలు అందించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఉప కమిషనర్లు నరసింహ, మల్లారెడ్డి, కార్పొరేటర్లు జగన్, విజయ శేఖర్ గౌడ్, రషీదా మహమ్మద్ రఫీ, మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్లు సురేష్ రెడ్డి, కెఎం.గౌరీష్, ఇంజనీరింగ్ విభాగం ఈఈలు లక్ష్మీ గణేష్, కిష్టప్ప, డీఈ లు పాపమ్మ, శిరీష, రూపాదేవి , వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అపదలో ఉన్న వారికి సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుంది

*** బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : అపదలో ఉన్న వారికి సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందని బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. భాగ్యలక్ష్మి కాలనీ కి చెందిన కె.కిరణ్ కుమార్ ఆరోగ్య పరిస్థితి బాగాలేదని తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ వైద్య సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి లబ్ధిదారుడు కె.కిరణ్ కుమార్ కు రూ.2.00 లక్షలను మంజూరు చేయించారు. అట్టి చెక్కును గురువారం కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద లబ్ధిదారుడికి ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం ఎదురుచూసేవారు ముఖ్యమంత్రి సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరమన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు విజయ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## పుస్తక పంపిణీ కై రూట్ మ్యాప్



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: 2025 26 విద్యా సంవత్సరమునకు కొత్తగూడెం మండలంలో గల సకల ప్రభుత్వ పాఠశాలలకు జూన్ మొదటి వారంలోనే ప్రభుత్వ పుస్తకాలు అందేలా కొత్తగూడెం మండల విద్యాశాఖ అధికారి డాక్టర్ ప్రభుదయాల్ ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందుకు గాను గురువారం ఎం ఆర్ సి కార్యాలయంలో కాంప్లెక్స్ తో హెచ్.ఎం, రిసోర్స్ పర్సన్ లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. అలానే జూన్ 3న నిర్వహించబడనున్న పదవ తరగతి అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షా నిమిత్తం స్థానిక సింగరేణి ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలించారు.

## మాదిగలకు మంత్రి పదవి ఇవ్వాలి

**: మోత్కుపల్లి నవీన్ కుమార్**



యాదగిరిగుట్ట రాజాపేట, ప్రజాస్ఫూర్తి : త్వరలో జరగబోయే మంత్రివర్గ విస్తరణలో మాదిగ సామాజిక వర్గానికి అవకాశం కల్పించాలని, సంఖ్య పరంగా ఆధిపత్యం కలిగిన మాదిగ సామాజిక వర్గానికి మంత్రివర్గ విస్తరణలో చోటు కనిపించాలని రాజపేట మండల ఎంఆర్పిఎస్ శాఖ అధ్యక్షులు మోత్కుపల్లి నవీన్ కోరారు. గురువారం ఆయన రాజపేట విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని దళిత జనాభాలో 60 శాతం మాదిగలు ఉన్నారని, సమాన ప్రాతినిథ్యం కోసం మంత్రివర్గంలో మాదిగ సామాజిక వర్గం నుండి మంత్రిని కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. మంత్రివర్గ విస్తరణలో సామాజిక న్యాయాన్ని, సామాజిక స్ఫూర్తి నింపాలని ఆయన కోరారు.



## రైతన్న సంక్షేమానికి మోడీ ప్రభుత్వం కృషి

- **బిజెపి మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతి కుమార్**
- **ప్రధాని నరేంద్ర మోడీ చిత్ర పటానికి పాలాభిషేకం**

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: దేశానికి వెన్నెముక అయిన రైతన్న సంక్షేమానికి మోదీ ప్రభుత్వం కృషి చేస్తుందని బిజెపి మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతి కుమార్ అన్నారు. మోదీ సర్కార్ వరి, వాణిజ్య పంటలకు మద్దతుతో పాటు 14 రకాల పంటలకు ధర పెంచడాన్ని హర్షం వ్యక్తం చేస్తూ ప్రధాని నరేంద్ర మోడీ చిత్ర పటానికి ముస్తాబాద్ మండల కేంద్రంలో బిజెపి నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన బుధవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో 202526 సంవత్సరానికి సంబంధించి ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధరలను (ఎంఎస్పి) ప్రకటించిందని, దీనిలో భాగంగా పలు ప్రధాన పంటలకు మద్దతు ధర పెంచినట్టు అధికారికంగా ప్రకటించారని, ఈ ఏడాది మద్దతు ధరల్లో కొన్ని పంటలకు గణనీయంగా పెరుగుదల ఉందని తెలిపారు. ఖరీఫ్ పంటల ఎంఎస్పిని ఖర్చు కంటే 50 శాతం ఎక్కువ ఇవ్వాలని నిర్ణయించారని, దీంతోపాటు రైతులకు రుణాలపై వడ్డీ రాయితీ కూడా ఇవ్వనున్నారని తెలిపారు. రైతులకు వారి ఉత్పత్తులకు లాభదాయకమైన ధరలు పొందడానికి, వారి ఆదాయాన్ని పెంచడానికి ఇది సహాయపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు వరి వెంకటేష్, జిల్లా అధికార ప్రతినిధి మాల్లారపు సంతోష్ రెడ్డి, జిల్లా ఆఫీస్ బేరర్ యేళ్ళ గిరిధర్, జిల్లా కౌన్సిల్ మెంబర్ మెరుగు అంజా గౌడ్, రమేష్ రెడ్డి, రామ్ గోపాల్, మీసా శంకర్, పట్టణ అధ్యక్షులు మెంగని మహేందర్, ప్రధాన కార్యదర్శి బాద నరేష్, కోలా కృష్ణా, ఉపాధ్యక్షులు గోపీ, తిరుపతి, మహేష్, శ్రీనివాస రావు, బూత్ అధ్యక్షులు భేదుర ప్రశాంత్, ఓరగంటి సత్యం, ధీటి సత్తయ్య, మద్దికుంట రమేష్, కాసారపు రవి, బుర్ర శీను, ప్రవీణ్, అరవింద్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



## రహదారులు , బ్రిడ్జిల నిర్మాణాలతోనే మారుమూల ప్రాంతాల అభివృద్ధి

*** మంత్రి ధనసరి సీతక్క**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: మారుమూల ప్రాంతాల అభివృద్ధి రహదారులు , బ్రిడ్జిల నిర్మాణాలతోనే సాధ్యమవుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళ, శిశు వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. గురువారం పాత పాల్వంచ నుండి పెనుబల్లి రోడ్డు 0/600 వద్ద ఆరున్నర కోట్ల రూపాయలతో నిర్మించునున్న హై లెవెల్ బ్రిడ్జి పనులకు స్థానిక శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు , భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ ఆధునిక యుగంలో హైవేలు, స్కై వేలు , ఫ్లై వేలు అన్ని వచ్చినప్పటికీ మారుమూల ప్రాంతాల్లో ఇప్పటివరకు వన్ వేలు కూడా రాలేదని అన్నారు. దానిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రతి గూడెం, తండాకు, గ్రామాలకు పంచాయతీలకు, మండలాలకు రోడ్డు కనెక్టివిటీ ఉండే విధంగా రహదారుల నిర్మాణం చేపడుతున్నామన్నారు. మారుమూల గిరిజన ప్రాంతాల అభివృద్ధికి, రహదారుల నిర్మాణానికి కృషి చేస్తానని మంత్రి తెలిపారు.ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ ప్రజల అవసరాలకు తగ్గట్టుగా బ్రిడ్జి నిర్మాణంలో మార్పు చేసి అవసరమైతే ఇంకా ఎక్కువ నిధులు కేటాయిస్తామని తెలియజేసినందుకు మంత్రికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.మారుమూల గిరిజన ప్రాంతాల అభివృద్ధికి రహదారులతో పాటు ఇంకా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టవలసిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈ ఈ శ్రీనివాసరావు, కమిషనర్ సుజాత, ఎంపీడీవో , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సాధనకు ఎంతో కృషి చేశారు

*** మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్**



హైదరాబాద్, (ప్రజాస్ఫూర్తి) : తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు తెలంగాణ రాష్ట్ర సాధనకు ఎంతో కృషి చేశారని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. అమెరికా వర్జిన్య లో జూన్ 1 న డలాస్ లో జరిగే బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సన్నాహక వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే బాల్కా సుమన్ , మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాల్క సుమన్ మాట్లాడుతూ చావు నోట్ల తలపెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారన్నారు. తెలంగాణ రాష్ట్ర డెవలప్ మెంట్ కోసము అలుపెరుగని కృషి చేసి తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచ పటంలో నిలబెట్టి తెలంగాణ ప్రజలు సగర్వంగా తల ఎత్తుకునేలా చేశారని అన్నారు. డలాస్ లో జరిగే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ , బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలకు కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొనే కార్యక్రమానికి ఎన్నారై సోదరులు అందరూ పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పల్ల రవి , నడిపల్లి శ్రీని , వర్జిన్య బిఆర్ఎస్ ప్రతినిధులు, వర్జిన్య బిఆర్ఎస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

## వన దేవతల చెంతకు నాగేంద్రుడు

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: నాగేంద్రుడు వనదేవతల చెంత ప్రత్యక్షమైన ఘటన ఇల్లందు పట్టణంలో జరిగింది. వివరాల్లోకి వెళితే... భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పట్టణంలోని ఆర్ అండ్ ఆర్ కాలనీ దండు సారయ్య (సారిక) ఇంట్లో బుధవారం రాత్రి సమ్మక్క సారలమ్మ తల్లికి పూజలు చేస్తుండగా ఒక్కసారిగా నాగుపాము దర్శనమిచ్చింది. దీంతో సారయ్య స్వయంగా సమ్మక్క - సారలమ్మ అమ్మవార్లు తన ఇంటికి వచ్చినట్లు భావించి కరుణించి కాపాడు తల్లీ, అందరూ బాగుండాలని, శాంతించమని వేడుకుంది. అన్ని పూజలు సక్రమంగా నిర్వహిస్తామని, ఎన్నెన్ని జన్మల పుణ్యఫలమో ఈ రోజు నా ఇంటికి వచ్చి దర్శనం ఇచ్చావా తల్లీ అంటూ పూజలు చేసింది. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు వచ్చి సమ్మక్క - సారలమ్మ వద్దనున్న నాగుపామును దర్శించుకుని పూజలు చేశారు.

## జడ్జి కావాలంటే 3 సం న్యాయవాదులుగా పనిచేయాలని సుప్రీంకోర్టు సూచించడం హర్షనీయం

*** లాయర్స్ పోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ హైకోర్టు న్యాయవాది నర్రి స్వామి**



యాదాద్రి భువనగిరి, ప్రజా స్ఫూర్తి : తెలంగాణ సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు లాయర్స్ పోరం ఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మునుగోడు నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం కంటెస్టెడ్ ఎంపీ అభ్యర్థి హైకోర్టు ప్రముఖ నర్రి స్వామి మునుగోడు నియోజకవర్గంలోని చౌటుప్పల్ కోర్టు కి వచ్చిన సందర్భంగా నారాయణపురం లో మాట్లాడుతూ నూతనంగా సుప్రీం కోర్టు న్యాయమూర్తులుగా నియమూర్తులయ్యే వ్యక్తులు జ్యుడిసరి వ్యవస్థలో పనిచేయాలనుకొనే జ్యుడిషరీ ఆఫీసర్లంతా కనీసం మూడు సంవత్సరాలు న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసి ఉండాలని సూచించడం చాలా హర్షించదగిన విషయం అన్నారు. న్యాయమూర్తిగా నియమితులయ్యే వ్యక్తులకు న్యాయవాదులుగా పనిచేసిన అనుభవం ఉంటే న్యాయవాదుల యొక్క సమస్యలు పై కాబట్టి అది అనుగుణంగా జడ్జిమెంట్లు ప్రొసీడింగ్స్ ఇవ్వడం జరుగుతుంది బెంచ్ కి న్యాయవాదం సంఘాల అసోసియేషన్ కీ స్నేహపూర్వక వాతావరణం ఉంటుంది న్యాయవాదుల యొక్క ప్రొఫెషన్లు వారికి అభివృద్ధి కూడా ఉంటుందని తెలియజేశారు

## హర్ష టొయోట కార్ షోరూం ప్రారంభం



యాదాద్రి భువనగిరి, ప్రజాస్ఫూర్తి భువనగిరి పట్టణం లోని స్థానిక తెలంగాణా హోటల్ వద్ద టోయట హర్ష కార్ ప్రవేట్ లిమిటెడ్ షోరూం ని గురువారం భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిగా పాల్గున్ని షోరూం ను ప్రారంభించరు ఈ సందర్బంగా వారు మాట్లాడు తు భువనగిరి పట్టణం లొ టోయట లాంటి పెద్ద పెద్ద షోరూం లొ రావడం చాలా సంతోషం గా ఉంది అని తెలిపారు మరియు టోయట కార్ ఉన్నా వారు ఎలాంటి సర్వీసింగ్ అయినా తరుచుగా హైదరాబాద్ వెల్లే వారు ఇప్పుడు అలాంటి అవసరం లేదు అని తెలిపారు ఈ కార్యక్రమం షోరూం టికేయం ఎస్ఆర్ అవతార్ సింగ్, ప్రశాంత్ సేల్స్ విపి బాల కృష్ణ రెడ్డి, ఏజీఎం స్వామి,ట్రస్ట్ యు జిఎం రాంబాబు సర్వీస్ మేనేజర్ సతీష్, అడ్మిన్. మాజీ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు. బాబు రావు. బిస్కొంట్ల సత్య నారాయణ. తాడూరి నర్సింహా. కృష్ణ యాదవ్. చిన్నం శ్రీను. తదితరులు పాల్గున్నారు

# తొలి బడి అమ్మ వడి మలి బడి అంగన్వాడీ బడి

*** మంత్రి ధన సరి సీతక్క**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: తొలి బడి అమ్మవడి మలి బడి అంగన్వాడీ బడి అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళ, శిశు , వయోవృద్ధుల సంక్షేమ శాఖల మంత్రి ధనసరి సీతక్క అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా ముందుగా మంత్రి పాత కొత్తగూడెం నుండి పెనుబల్లి రోడ్డు 0/600 వద్ద 6.50 కోట్ల రూపాయలతో నిర్మించనున్న హై లెవెల్ బ్రిడ్జి పనులకు కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి కొత్తగూడెం క్లబ్ లో ఏర్పాటుచేసిన ఇందిరమ్మ అమృతం పథకం ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఐసిడిఎస్ వారు ఏర్పాటు చేసిన స్టాల్స్ ను మంత్రి పరిశీలించి వేస్ట్ నుండి బెస్ట్ రూపొందించిన కళాకృతులను చూసి అభినందించారు. ఆడపిల్లలకు శక్తినిద్దాం.. ఆరోగ్య తెలంగాణను నిర్మిద్దాం అనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన ఇందిరమ్మ అమృతం పథకాన్ని మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోలిక బలరాం నాయక్, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అనిత రామచంద్రన్, మహిళ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ , ఐటిడిఏ పిఓ రాహుల్ తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కౌమార బాలికల్లో రక్తహీనతను నివారించేందుకు ఇందిరమ్మ అమృతం పేరిట ఈ పథకాన్ని అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా భద్రాద్రి





కొత్తగూడెం, కొమురం భీం ఆసిఫాబాద్ , జయశంకర్ భూపాలపల్లి జిల్లాలలో ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ పథకం ద్వారా మూడు జిల్లాల్లో 50 వేల 269 మంది బాలికలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఏజెన్సీ ప్రాంతాలలో ఆడపిల్లలు సరైన పౌష్టికాహారం లేక అనేక రకాల జబ్బులు , పౌష్టికాహార లోపం తలెత్తుతుందన్నారు. వాటిని 14 నుండి 18 సంవత్సరాల లోపు బాలికలకు ఈ ఇందిరమ్మ అమృతం పథకం ద్వారా మిల్లెట్స్ తో కూడిన చిక్కీలను నెలకు రెండు ప్యాకెట్లు అందించడం జరుగుతుందన్నారు. ఒక్కో ప్యాకెట్లో 15 చిక్కిలు ఉంటాయని రోజుకు ఒక చిక్కి తిండటం ద్వారా ఆడపిల్లలు నెలసరి టైం లో వచ్చే సమస్యలను, రక్తహీనతను తగ్గించి , శక్తిని పెంపొంచే విధంగా ఈ చెక్కిలు ఉంటాయని మంత్రి తెలిపారు. ఆడపిల్లను ఎదగనిద్దాం, బ్రతకనిద్దాం, గౌరవిద్దాం.. వారిని ప్రోత్సహించి లక్ష్యాలను సాధిద్దాం అని మంత్రి పిలుపునిచ్చారు. అంగన్వాడీ కేంద్రాలన్నింటిని ప్రీ ప్రైమరీ పాఠశాలలుగా మార్చడం జరిగిందని, పిల్లలందరికీ నర్సరీ



పాటలతో పాటు ఆహారం అందించడం జరుగుతుందన్నారు. ప్రైవేటు పాఠశాలకు వెళ్లి తల్లిదండ్రుల కష్టాలు వృధా చేయకుండా అంగన్వాడీ కేంద్రాలు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తయారు చేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలు ఆడుకోవడానికి 57 రకాల ఆట వస్తువులను అందుబాటులో ఉంచామన్నారు. అంగన్వాడీ టీచర్లు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్నటువంటి రిటైర్మెంట్ బెనిఫిట్ రెండు లక్షల రూపాయలు అందించడానికి ఆమోదం తెలుపుతూ నిన్న సాయంత్రం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సంతకం చేశారని తెలిపారు. చిన్న చిరు ఉద్యోగుల కష్టాలు కన్నీళ్లు తుడవడమే ప్రభుత్వ లక్ష్యం అని మంత్రి అన్నారు. రాబోయే కాలంలో ఆశ వర్కర్ల జీతాల పెంపు , రెగ్యులైజేషన్ చేస్తామని తెలిపారు. ప్రభుత్వం అందించే పథకాలు క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరికి అందే విధంగా ఉద్యోగస్తులు సహకరించాలన్నారు. విద్యార్థుల అభివృద్ధికి అమ్మ, నాన్న , ఉపాధ్యాయులు ఈ ముగ్గురు మాత్రమే కీలకమని తెలిపారు. మిషన్ వాత్సల్య పథకం కింద తల్లిదండ్రులు లేని పిల్లలకు అండగా ప్రభుత్వం నెలకు 4 వేల రూపాయలను అందజేస్తున్నట్లు మంత్రి తెలిపారు. తల్లితండ్రులు లేని పిల్లలు బాధపడొద్దని ఇంత పెద్ద ప్రభుత్వం మీ వెంట ఉందని మంత్రి అన్నారు.ఈ పథకం కింద జిల్లాకు మంజూరు అయిన 74 లక్షల 64 వేల రూపాయల చెక్కును పిల్లలకు మంత్రి అందజేశారు.అంగన్వాడి టీచర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్ కింద రెండు లక్షల రూపాయలు ఆమోదానికి కృషిచేసిన మంత్రి సీతక్కను మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు , అంగన్వాడీ టీచర్లు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో నాగలక్ష్మి, సిపిఓ సంజీవరావు,మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లేనినా, జిల్లా అధికారులు, అంగన్వాడి టీచర్లు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జేఈటిఎల్ రోడ్డుకు రతన్ టాటా పేరు పెట్టాలి



*** ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ కు వినతి**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : జీడిమెట్ల నుండి దూలపల్లికి వెళ్లే జేఈటిఎల్ రోడ్డుకు రతన్ టాటా పేరు పెట్టాలని గురువారం సామాజిక కార్యకర్త కోల రవీందర్ ముదిరాజ్ బీఆర్ఎస్ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈ యొక్క రోడ్డుకు పారిశ్రామికవేత్త అయినటువంటి రతన్ టాటా భారతదేశానికి ఎంతో మేలు చేసినటువంటి వారు కరోనా సమయంలో యావత్ ఆస్తిని కూడా భారతదేశానికి ఇస్తాను అనేటటువంటి ఆపద్బాంధవుడు, నిస్వార్ధపరుడు, ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉన్న మహా వ్యక్తి గుండుసూది మొదలు విమాన తయారీ వరకు తయారుచేసిన ఘనుడన్నారు. అతని పేరు పెట్టడం అతనికి విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయడం ఎంతైనా అవసరమని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాదురుపల్లి మాజీ కౌన్సిలర్ సత్యనారాయణ రావు, సద్దాం , వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ గా కొత్తగూడెం...

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం మున్సిపాలిటి కార్పొరేషన్ గా అప్ గ్రేడ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. కొత్తగూడెం మున్సిపాలిటీ కమిషనర్ సుజాతను నూతన కార్పొరేషన్ కమిషనర్ నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.కార్పొరేషన్ గా అప్ గ్రేడ్ చేస్తూ జీవో విడుదల కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీ, పాల్వంచ మున్సిపాలిటీ, సుజాతనగర్ తో పాటు కోమటపల్లి, నిమ్మలగూడెం, లక్ష్మీదేవిపల్లి, నరసింహసాగర్, మంగపేట, నాయకులగూడెం గ్రామాలు విలీనమయ్యాయి. నూతన కార్పొరేషన్ గా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

### ఏపీలో స్పౌజ్ కేటగిరీలో కొత్తగా

## 71,380 పింఛన్ల జారీకి ఆదేశం

అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా స్పౌజ్ కేటగిరీ కింద 71,380 మందికి కొత్తగా పెన్షన్లు జారీకి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆదేశాలు జారీ చేసింది. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద 2025 మే నెల నుంచి స్పౌజ్ కేటగిరీ పెన్షన్ల జారీకి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో నెలకు రూ.4 వేలు చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 71,380 మందికి కొత్తగా పెన్షన్ల జారీకి సెర్ప్ సీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. జూన్ 12న ఈ పెన్షన్లను లబ్దిదారులకు అందించనున్నట్టు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

### ఏపీ మద్యం కేసులో

## నలుగురు నిందితులకు కస్టడీ

విజయవాడ: మద్యం కేసులో నిందితుల కస్టడీ పిటిషన్‌లపై విజయవాడ ఏసీబీ కోర్టు తీర్పు వెలువరించింది. నిందితులను రెండ్రోజుల పాటు కస్టడీకి అనుమతిస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. నిందితులు ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్ప బాలాజీ, రాజ్ కెసిరెడ్డిలను కస్టడీకి ఇస్తూ తీర్పు వెల్లడించింది. నిందితులను సిట్ అధికారులు రేపు, ఎల్లుండి విచారించనున్నారు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు విచారించేందుకు కోర్టు అనుమతిచ్చింది. న్యాయవాది సమక్షంలో విచారణ జరపాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

## కవితలో ఇంత ఆవేదన ఉందని ఇవాళే తెలిసింది

**: భారాస నేత వినోద్**

హైదరాబాద్: రాజకీయాల్లో ప్రకంపనలు సహజమని, చాలా పార్టీల్లో ఇలాంటి ప్రకంపనలు చూశామని మాజీ ఎంపీ, భారాస నేత వినోద్ కుమార్ అన్నారు. ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలపై స్పందిస్తూ.. ఇలాంటి విషయాల్లో తమ పార్టీ మొదటిది కాదు.. చివరిది కాదని వ్యాఖ్యానించారు. భాజపాతో పనిచేయాలనుకుంటే ఎప్పుడో పొత్తు పెట్టుకునేవాళ్లమన్నారు. కవితలో ఇంత ఆవేదన ఉందని ఇవాళే తెలిసిందని.. ఆమెతో మాట్లాడే ప్రయత్నం చేస్తానని తెలిపారు. త్వరలోనే అన్నీ సర్దుకుంటాయని పూర్తి విశ్వాసంతో ఉన్నట్టు చెప్పారు.




**కవిత ఏమన్నారంటే?**

భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కు తాను అంతర్గతంగా ఇచ్చిన ఫీడ్‌బ్యాక్ ఎలా లీక్ అయిందని ఆయన కుమార్తె, ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు. కట్టడి చేయమంటే పెయిడ్ సోషల్ మీడియాలో విమర్శిస్తున్నారని ఆరోపించారు. మీడియాతో చిట్‌చాట్‌లో ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. ‘‘కేసీఆర్‌కు నోటీసులు ఇస్తే నేతలెవరూ స్పందించకపోతే ఎలా? నాకు నీతులు చెబుతూ కోవర్టులు ఉన్నారంటున్నారు. నా మీద పడి ఏడిస్తే ఎలా?ఇంటి ఆడబిడ్డ గురించి ఎలా పడితే అలా మాట్లాడిస్తే అది మర్యాదేనా? లిక్కర్ కేసు సమయంలో రాజీనామా చేస్తానంటే కేసీఆర్ వద్దని వారించారు. ఎంపీగా పోటీ చేస్తే సొంత పార్టీ వాళ్లే కుట్రపూరితంగా ఓడించారు. అదే జిల్లాలో ప్రొటోకాల్ ఉండాలని కేసీఆర్ ఎమ్మెల్సీ ఇచ్చారు. లీకు వీరులను ఎండగట్టమంటే నాపై ప్రతాపం చూపుతున్నారు. కాంగ్రెస్, భాజపాపై మాట్లాడాలి కానీ.. నాపై దాడి చేస్తే ఎలా? భారాసను గంపగుత్తగా భాజపాకు అప్పగించాలన్న ప్రయత్నం జరుగుతోంది. జైలులో ఉన్నప్పుడే ఆ ప్రతిపాదన వస్తే నేను వ్యతిరేకించాను. భాజపాలో భారాస విలీనం కాకుండా స్వతంత్రంగా ఉండాలన్నదే నా అభిమతం. నాపై దుష్ప్రచారం చేస్తున్నా పార్టీ స్పందించలేదు. నన్ను పార్టీ నుంచి ఎవరు బయటకు పంపుతారు?.. అంత సీన్ లేదు. కాంగ్రెస్‌తో సంప్రదింపులు జరిపినట్లు జరుగుతున్న ప్రచారం శుద్ధ అబద్ధం. భారాసలో కేసీఆర్ మాత్రమే నాకు నాయకుడు.. ఆయన నాయకత్వంలోనే పనిచేస్తాను. వెన్నుపోటు పొడవడం నా లక్షణం కాదు... నేరుగానే పోరాడతాను. కొత్త పార్టీ అవసరం లేదు.. ఉన్న పార్టీని బాగా చూసుకుంటే చాలు. లేఖలో నేను చేసిన సూచనల్లో ఒక్కటైనా తప్పుందా? కేసీఆర్‌ను నడిపించేంత పెద్దవాళ్లు అయ్యారా? కడుపులో విషం పెట్టుకుని బయటకు నవ్వుతూ ఉండలేను. నా తండ్రికి వందల లేఖలు రాశాను.. తప్పేంటి? సాధారణంగా కేసీఆర్ లేఖను చదివాక చింపుతారు. ఈసారి అలా చింపలేదు. కుట్ర ఎవరు చేశారో నాకు తెలియదు... బయటపెట్టాలని అంటున్నాను. లీకు వీరుడా.. లీకు వీరులా? అనేది తెలియాలి’’ అని కవిత అన్నారు.



## శెభాష్.. స్మార్ట్‌ఫోన్ ముట్టుకోకుండా సివిల్స్ కొట్టావమ్మా

**: సజ్జనార్ ప్రశంస**

హైదరాబాద్: ఇటీవల యూపీఎస్సీ సివిల్స్ ఫలితాల్లో 11వ ర్యాంకుతో అదర గొట్టిన ఇట్టబోయిన సాయి శివానిని తెలంగాణ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ అభినందించారు. సాధారణ కుటుంబానికి చెందిన సాయి శివాని.. సివిల్స్‌లో చిన్న వయసులోనే అత్యుత్తమ ర్యాంకు సాధించి యువతకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. నేటి డిజిటల్ యుగంలో స్మార్ట్ ఫోన్ ముట్టుకోకుండా, సోషల్ మీడియా జోలికి వెళ్లకుండా అనుకున్న లక్ష్యాన్ని సాధించారంటూ ప్రశంసలు కురిపించారు. విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసి ఉన్నతంగా రాణించాలని ఆమెకు సూచించారు. సివిల్స్ ర్యాంకర్ సాయి శివాని మేనమామ ప్రకాశ్ రావు ఆర్టీసీలో డీఎం హోదాలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో గురువారం ఆమె తన కుటుంబ సభ్యులతో వచ్చి సజ్జనార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె తల్లిదండ్రులు రాజు, రజితతో పాటు సాయి శివానిని సజ్జనార్ సత్కరించారు. అనంతరం ఈ ఫొటోలను సజ్జనార్ తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు.

# కుమారుడిని కేంద్రమంత్రిని చేసి తప్పుచేశా - రామదాస్





తమిళనాడులో కీలక నేత, పీఎంకే (పాట్టాలి మక్కల్ కట్చి) వ్యవస్థాపకుడు డాక్టర్ ఎస్ రామదాస్ కీలక వ్యాఖ్యలు చేశారు. తన కుమారుడు అన్బుమణి రామదాస్‌ను గతంలో కేంద్రమంత్రిని చేసి తప్పుచేశానని వ్యాఖ్యానించారు. తన సిద్ధాంతాలకు విరుద్ధంగా నాటి నిర్ణయం జరిగిందన్నారు. ఇటీవల పార్టీ అధ్యక్ష పదవి నుంచి కుమారుడిని తప్పిస్తున్నట్లు ప్రకటించిన ఆయన.. తాజాగా ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. పార్టీలో తాజా పరిణామాలపై తైలాపురంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడిన డాక్టర్ రామదాస్.. క్రమశిక్షణ, పార్టీ నియమాలు, సీనియర్ల పట్ల అంతగా గౌరవం లేని వ్యక్తి గురించి మాట్లాడలేనన్నారు. ధర్మపురి సభలో కుమారుడి ప్రసంగాన్ని ప్రస్తావిస్తూ.. పార్టీ కార్యకర్తల దృష్టి మరల్చి, సానుభూతి పొందేందుకే ఆయన అలా మాట్లాడాడని అన్నారు. అది ఆయన తప్పు కాదని, సిద్ధాంతాలకు విరుద్ధంగా వెళ్లి కుమారుడిని గతంలో కేంద్ర మంత్రిని చేయడమే తన తప్పని వ్యాఖ్యానించారు. ''అన్బుమణికి 35ఏళ్ల వయసులో కేంద్ర మంత్రిని చేసి తప్పుచేశా. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో భాజపాతో పొత్తు పెట్టుకున్నాడు'' అని వ్యాఖ్యానించారు. అవసరమైతే పార్టీ కార్యవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేసి.. అన్బుమణిని పార్టీ పదవి నుంచి తొలగిస్తానని అన్నారు. యూపీఏ ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా పనిచేసిన ఆయన.. 2004-2009 వరకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రిగా కొనసాగిన విషయం తెలిసిందే. పీఎంకే అధ్యక్షుడిగా కొనసాగుతున్న అన్బుమణి రామదాస్‌ను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సీనియర్ రామదాస్ ఇటీవల ప్రకటించారు. పార్టీపై పూర్తి నియంత్రణ ఇక తన చేతుల్లోనే ఉండనుందన్నారు. ఏప్రిల్ 10న కేంద్రమంత్రి అమిత్ షా చెన్నై పర్యటన సందర్భంలో ఈ అనూహ్య ప్రకటన వెలువడింది. దీంతో అన్బుమణి వర్గం కూడా ఒక్కసారిగా తీవ్ర అసంతృప్తికి లోనయ్యింది. ఇటీవల ధర్మపురిలో జరిగిన సమావేశంలో అన్బుమణి మాట్లాడుతూ.. అధ్యక్ష పదవి నుంచి తనను ఎందుకు తప్పించారో చెప్పాలని ప్రశ్నించారు. తన మేనల్లుడు ముకుందన్‌ను పార్టీ యువజన విభాగం అధ్యక్షుడిగా నియమించడాన్ని వ్యతిరేకించారు. ఈ క్రమంలో తిరిగి పార్టీ అధ్యక్షుడిగా నియమించాలని ఆయన మద్దతుదారులు కూడా పలుచోట్ల నిరసనలు చేపట్టారు.



## మేము రెడీ.. వెంటనే ఎన్నికలు నిర్వహిస్తారా..?

**: దీదీ సవాల్**

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా సమయం మిగిలి ఉండగానే రాజకీయ వాతావరణం వేడెక్కింది. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం మమతా బెనర్జీ మధ్య మాటల యుద్ధం మొదలైంది. తనపై మోదీ చేసిన విమర్శలకు స్పందించిన దీదీ.. ఎన్నికలు వెంటనే నిర్వహించగలరా అంటూ సవాల్ విసిరారు. అలీపుర్‌దుర్‌లో భాజపా నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ప్రధాని మోదీ తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఇక్కడ ప్రజలపై దయలేని ప్రభుత్వం కొనసాగుతోందని.. రాష్ట్రంలో హింస జరుగుతున్న పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మార్పు కావాలని బెంగాల్ ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. ''టీచర్ నియామకాల్లో కుంభకోణం జరిగింది. వేలాది మంది కుటుంబాల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. బెంగాల్ విద్యావ్యవస్థ నాశనం అయింది. టీఎంసీ నేతలు ఎన్నో నేరాలు చేశారు. కానీ, వారి తప్పులను అంగీకరించడానికి బదులుగా న్యాయవ్యవస్థలు ఇచ్చిన తీర్పులను తప్పు పడుతున్నారు. పేదల హక్కులు హరిస్తున్నారు. నిరుద్యోగంతో రాష్ట్ర యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఇకనైన బుజ్జగింపు రాజకీయాలు, గూండాయిజానికి స్వస్తి పలకండి'' అని మోదీ హితవు పలికారు. ఆయన వ్యాఖ్యలపై స్పందించిన దీదీ అసహనం వ్యక్తం చేశారు. ''పహల్గాం ఘటనపై యావత్ దేశం దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తోంది. ఆపరేషన్ సింధూర్‌తో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడాం. మేమంతా ఒక్కటే, ఉగ్రవాదాన్ని సహించేది లేదు, ఐక్యతే మా బలం అనే సందేశాన్ని తెలియజేయడానికి అఖిలపక్ష ప్రతినిధులు విదేశాలల్లో పర్యటిస్తున్న సందర్భంలో ప్రధాని మోదీ ఈ విధంగా మాట్లాడడం బాధాకరం. ఆయన నుంచి ఇలాంటి వ్యాఖ్యలు రావడం నన్ను ఆశ్చర్యానికి గురి చేశాయి. బెంగాల్ ప్రజలు నా వెంట ఉన్నారు. టీఎంసీకే వారి మద్దతు. అసెంబ్లీ ఎన్నికలను వెంటనే నిర్వహించండి'' అని సవాల్ విసిరారు.

## కాంట్రాక్టులపై సంతకాలు చేస్తారు.. డెలివరీలు జరగవు: వాయుసేన చీఫ్ అసంతృప్తి

రక్షణ రంగంలోని ప్రధాన కాంట్రాక్టులపై సంతకాలు జరుగుతాయి కానీ.. డెలివరీలు మాత్రం మొదలుకావని వాయుసేన అధిపతి ఎయిర్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సీఐఐ వార్షిక సమావేశంలో ఆయన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సమక్షంలోనే ఈ వ్యాఖ్యలు చేశారు. ''చాలా సార్లు కాంట్రాక్టులపై సంతకాలు జరుగుతాయి.. కానీ, సిస్టమ్స్ (ఆయుధాలు) మాత్రం ఎప్పటికీ అందవు. టైమ్‌లైన్ ప్రధాన సమస్య. సకాలంలో పూర్తయిన ఒక్క ప్రాజెక్టు కూడా నాకు గుర్తుకురావడంలేదు. మనం చేయలేని పనికి ఎందుకు వాగ్దానాలు చేయడం? తేజస్ ఎంకే1 చాలా ఆలస్యమైంది. ఇక తేజస్ ఎంకే2 ప్రొటోటైప్ కూడా అందుబాటులోకి రాలేదు. ఇక ఆమ్కా ఫైటర్‌కు సంబంధించి ఇప్పటి వరకు నమూనా విమానం కూడా రాలేదు. మన దళాలు.. పరిశ్రమ మధ్య విశ్వాసం పెరగాల్సిన అవసరం ఉంది. పారదర్శకత చాలా అవసరం. మనం ఒక్కసారి దేనికైనా కట్టుబడితే.. దానిని అందించి తీరాల్సిందే. మేకిన్ ఇండియా కోసం వాయుసేన శక్తివంచన లేకుండా కృషి చేస్తోంది. మనం ఈరోజు సంసిద్ధంగా ఉంటేనే.. భవిష్యత్తుకు సన్నద్ధం కాగలము. రానున్న పదేళ్లలో.. మన పరిశ్రమలు ఉత్పత్తిని గణనీయంగా పెంచగలవు. కానీ, ప్రస్తుతానికి మనం త్వరగా చర్యలు తీసుకోవడం అవసరం. దళాలను శక్తిమంతం చేసుకొంటేనే యుద్ధాలు గెలుస్తాం'' అని పేర్కొన్నారు.

*** యుద్ధ రంగం వేగంగా మారిపోతోంది..!**

యుద్ధ రంగంలో వేగంగా మారిపోతున్న సాంకేతికతలను అందిపుచ్చుకోవాలని ఎయిర్ మార్షల్ ఏపీ సింగ్ సూచించారు. ''మన నౌకాదళాధిపతి చెప్పినట్లు యుద్ధ రంగం వేగంగా మారిపోతోంది. ప్రతి రోజు సరికొత్త టెక్నాలజీలు అందుబాటులోకి వస్తున్నట్లు చూస్తున్నాం. ఆపరేషన్ సిందూర్‌తో.. మనం ఎక్కడ ఉన్నాం.. భవిష్యత్తుకు ఏం కావాలనే దానిపై స్పష్టమైన అవగాహన వచ్చింది. మనం చేయాల్సింది చాలా ఉంది.

### పాక్‌తో కాల్పుల విరమణ..

## 'ట్రంప్ టారిఫ్'నకు తావేలేదు: తేల్చిచెప్పిన భారత్



భారత్‌పాక్ మధ్య ఇటీవల కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంలో 'ట్రంప్ టారిఫ్'కు తావేలేదని భారత ప్రభుత్వం తేల్చిచెప్పింది. ''టారిఫ్ అధికారం వల్లనే ఇటీవల భారత్‌పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందాన్ని ట్రంప్ సాధించగలిగారు'' అంటూ యూఎస్ యంత్రాంగం కోర్టులో వాదించిన నేపథ్యంలో ఈ స్పందన వచ్చింది. ''ఈ అంశంపై భారత వ్యతిరేక తను వ్యక్తం చేశాం. మే 7న ఆపరేషన్ సిందూర్ నుంచి మే 10న జరిగిన కాల్పుల విరమణ వరకు.. సైనికపరమైన పరిణామా లపై భారత్‌అమెరికా మాట్లాడుకున్నాయి. ఆ సమయంలో సుంకాల ప్రస్తావన ఎన్నడూ రాలేదు'' అని మన విదేశాంగ శాఖ గురువారం మరోసారి స్పష్టం చేసింది. ఆపరేషన్ సిందూర్‌పై మే 9న ప్రధాని నరేంద్ర మోదీతో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ మాట్లాడారు. అగ్రరాజ్య విదేశాంగశాఖ మంత్రి మార్కో రుబియో మే 8, 10వ తేదీల్లో భారత విదేశాంగశాఖ మంత్రి జైశంకర్‌తో చర్చలు జరిపారు. అదేవిధంగా మే 10న భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్‌తోనూ మాట్లాడారు. ''ఏ సందర్భంలోనూ ఇరుదేశాల మధ్య వాణిజ్య అంశం ప్రస్తావనకు రాలేదు. కాల్పుల విరమణకు, వాణిజ్యానికి సంబంధం లేదు'' అని కొన్నిరోజుల క్రితమే భారత్ స్పష్టంగా చెప్పిన సంగతి తెలిసిందే. అంతకుముందు కాల్పుల విరమణపైనా ట్రంప్ తొలుత ప్రకటన చేయగా.. భారత్ మాత్రం ట్రంప్ పాత్రను ప్రస్తావించలేదు. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలపై భారీస్థాయిలో సుంకాలను విధించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు న్యాయస్థానంలో ఎదురుదెబ్బ తగిలింది. ట్రంప్ టారిఫ్‌లు అమలుకాకుండా యూఎస్ ట్రేడ్ కోర్టు నిలుపుదల చేసింది. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే అంతర్జాతీయ అత్యయిక ఆర్థిక అధికారాల చట్టం కింద అధ్యక్షుడికి ప్రపంచదేశాలపై ఆర్థిక ఆంక్షలు విధించే అవకాశం ఉంటుందని న్యాయస్థానం తేల్చిచెప్పింది. ఈ విచారణ సందర్భంగా 'భారత్‌పాక్ ఉద్రిక్తతల' అంశాన్ని ట్రంప్ సర్కారు ప్రస్తావించగా.. కోర్టు దాన్ని తోసిపుచ్చింది.

## మద్యం తాగిన తర్వాత మనిషి మృగంలా మారుతాడు

**: రేప్‌కేసులో సుప్రీం వ్యాఖ్యలు**



దిల్లీ: తన ఏడేళ్ల కుమార్తెపై ఒక తండ్రి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ కేసులో దోషిగా తేలిన అతడికి శిక్ష ఖరారైంది. తనకు విధించిన శిక్షను రద్దు చేయాలని దోషి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. దీనిపై తాజాగా విచారణ చేపట్టిన న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. మద్యం తాగిన తర్వాత మనిషి మృగంలా మారుతాడంటూ వ్యాఖ్యానించింది. ''ఒక ఏడేళ్ల చిన్నారికి అతడు ఇలాంటి పరిస్థితి కల్పించాడు. ఎవరూ కూడా తమ కుమార్తెలపై ఇలాంటి దారుణ చర్యకు పాల్పడరు. ఆ బాలికకు కన్న తండ్రిపై అబద్ధపు సాక్ష్యాలు చెప్పాల్సిన అవసరం ఏంటి..? ఆమె ఎంతో బాధను అనుభవించింది. మద్యం తాగిన తర్వాత మనిషి మృగంలా మారుతాడు. అతడికి బెయిల్ ఇవ్వకపోవడానికి చాలా కారణాలు ఉన్నాయి. దోషిగా తేలిన అతడికి శిక్ష నుంచి మినహాయింపు ఎలా కల్పించాలి'' అని జస్టిస్ బీవీ. నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. దోషి చేసిన అభ్యర్థనను తిరస్కరించింది.

## ఆ కొవిడ్ పేషంట్‌ను చంపేయ్..! ఓ డాక్టర్ ఆడియో క్లిప్ వైరల్



నాలుగేళ్ల క్రితం యావత్ ప్రపంచాన్ని కరోనా వైరస్ మహమ్మారి కకావికలం చేసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో మహారాష్ట్రలో హృదయవిదారక ఘటన చోటుచేసుకోగా.. అందుకు సంబంధించిన ఆడియో ఇటీవల వైరల్‌గా మారింది. ఆసుపత్రిలో సరిపడా పడకలు లేకపోవడంతో కొవిడ్ చికిత్స తీసుకుంటున్న ఓ మహిళా రోగిని చంపేయాలని ఓ వైద్యుడు సహచర వైద్యుడికి సూచించినట్లు తెలిసింది. దీనిపై బాధిత కుటుంబం ఫిర్యాదు మేరకు సదరు వైద్యుడిపై కేసు నమోదైంది. 2021లో కరోనా మహమ్మారి తీవ్రంగా ప్రబలిన సమయంలో రోగులతో ఆసుపత్రులు కిక్కిరిసిపోయాయి. బాధితులకు పడకలు, ఆక్సిజన్ దొరకడమే కష్టంగా మారింది. అదే సమయంలో మహారాష్ట్ర లాతూర్ జిల్లాలోని ఉద్గిర్ ప్రభుత్వ ఆసుపత్రిలో కొవిడ్ కేర్ సెంటర్ ఏర్పాటు చేశారు. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న జిల్లా అదనపు సర్జన్‌గా ఉన్న డాక్టర్ శశికాంత్ దేశ్‌పాండే, మరో వైద్యుడు శశికాంత్ డాంగేల మధ్య ఫోన్ సంభాషణ జరిగింది. పదిరోజులుగా చికిత్స పొందుతున్న ఓ మహిళను చంపేయాలని శశికాంత్ డాంగేకు దేశ్‌పాండే ఫోన్‌లో సూచించాడు. దీనికి డాంగే స్పందిస్తూ.. ఆక్సిజన్‌ను సరఫరాను ఇప్పటికే తగ్గించినట్లు చెప్పడం గమనార్హం. ఆసుపత్రిలో అవసరం మేరకు పడకలు లేకపోవడంతో అలా చెప్పినట్లు వారి సంభాషణను బట్టి తెలిసింది.

**అసలేం జరిగిందంటే..**

ఉద్గిర్ ఆసుపత్రిలో బాధిత మహిళ పది రోజులపాటు చికిత్స తీసుకుంది. ఏడవ రోజు.. మధ్యాహ్నం సమయంలో ఆమె భర్త పక్కనే డాక్టర్ డాంగే కూర్చొని భోజనం చేస్తున్నాడు. అదే సమయంలో అతడికి డాక్టర్ దేశ్‌పాండే నుంచి ఫోన్ వచ్చింది. లౌడ్‌స్పీకర్ ఆన్ చేసిన డాంగే.. ఆసుపత్రిలో అప్పటి పరిస్థితులను వివరిస్తున్నాడు. ఎన్ని పడకలు అందుబాటులో ఉన్నాయని దేశ్‌పాండే అడగ్గా.. ప్రస్తుతం ఖాళీ లేవని డాంగే చెప్పాడు. దీంతో ఓ మహిళా రోగి పేరు చెప్పిన దేశ్‌పాండే.. 'ఆమెను చంపేయ్.. నీకు అలవాటే కదా' అంటూ వ్యాఖ్యానించాడు. ఇదంతా పక్కనే ఉన్న బాధిత రోగి భర్త విని షాక్‌కు గురయ్యాడు. చికిత్స అందుతున్నందున మౌనంగా ఉండిపోవాలని నిశ్చయించుకున్న అతడు.. ఆ తర్వాత కొన్ని రోజుల్లోనే ఆమె కోలుకోవడంతో డిశ్చార్జి చేయించి తీసుకువెళ్లాడు.

# చంద్రబాబును యావత్ ప్రపంచం కీర్తిస్తోంది: మాధవి రెడ్డి

కడప: తెలుగువాడి ఆత్మగౌరవ అగ్నిజ్వాలను నాటి ఢిల్లీ పాలకులకు తెలియజేయడం కోసం పుట్టిన పార్టీయే తెదేపా అని కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి అన్నారు. బడుగు బలహీన వర్గాల వారి అభ్యున్నతికి, రాజకీయ స్వాతంత్ర్యం కోసమే ఈ పార్టీ పుట్టిందన్నారు. మహానాడులో ఆమె మాట్లాడుతూ.. "43 ఏళ్ల తెదేపా చరిత్రలో తొలిసారిగా కడపలో



మహానాడు నిర్వహించుకుంటున్నాం. ఈ పార్టీకి క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన కార్యకర్తలే వెన్నెముక. రాష్ట్రంలో మొట్ట మొదటిసారి వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పెన్షన్‌లు ఇచ్చిన మహానాయకుడు ఎన్టీఆర్ అయితే.. వాటిని రూ. 4 వేల నుంచి రూ.15 వేల వరకు పెంచిన ఘనత నారా చంద్రబాబునాయుడిది. రాయలసీమ కోసం ఎన్టీఆర్ తెలుగు గంగ ప్రాజెక్టును నిర్మిస్తే.. ఎస్ఆర్‌బీసీ, హెచ్ఎన్ఎస్, సీఎన్ఎస్ఎస్, కేసీ కెనాల్‌లను అభివృద్ధి చేసిన చంద్రబాబు.. లక్షలాది మంది రాయలసీమ ప్రజల దాహార్తిని తీరుస్తున్నారు. ఎన్టీఆర్ ఆశయాలను, సిద్ధాంతాలను కొనసాగిస్తూనే.. పరిపాలన, సంక్షేమం, అభివృద్ధిలో పలు సంస్కరణలను తీసుకొచ్చారు. క్రమశిక్షణ, పట్టుదల, అకుంఠిత దీక్ష, నేర్పు, ఓర్పు కలిగిన విజనరీ నాయకుడిగా చంద్రబాబును యావత్ ప్రపంచం కీర్తిస్తోంది. మనకు కేవలం నదులపై ఆనకట్టలు కనిపిస్తే.. చంద్రబాబుకు మాత్రం నదుల అనుసంధానం గుర్తొస్తుంది. దానికి కార్యరూపమే పట్టిసీమ ఎత్తిపోతల పథకం. పోలవరాన్ని పూర్తి చేసి.. కృష్ణా జలాలను బనకచర్ల రిజర్వాయర్ వరకు తీసుకొస్తే.. రాయలసీమ అభివృద్ధిని ఆపే శక్తి ఎవరికీ ఉండదు" అని మాధవి రెడ్డి అన్నారు.



## పోటెత్తిన అభిమానం.. జనసంద్రమైన మహానాడు ప్రాంగణం

కడప: మహానాడు బహిరంగ సభకు రాష్ట్ర నలుమూలల నుంచి తెలుగు తమ్ముళ్లు కదం తొక్కారు. ఆశించిన మేర కన్నా అధిక సంఖ్యలో తరలిరావడతో కడప పరిసరాలు జనసంద్రంగా మారాయి. తెలుగుదేశం జెండా వాహనాలతో రహదారులు కిట కిటలాడుతున్నాయి. మహానాడుకు సమీప గ్రామాల ప్రజలు ద్విచక్రవాహనాలు, కాలినడకన చేరుకున్నారు. అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావడంతో సభా ప్రాంగణానికి మూడు కిలోమీటర్ల దూరం లోనే వాహనాలను నిలిపివేశారు.

**భారీగా భోజన ఏర్పాట్లు..**

మహానాడు ప్రాంగణంలో 3 లక్షల మందికి సరిపడా భోజన ఏర్పాట్లు చేశారు. కార్యకర్తల కోసం కడప మార్గమధ్యంలో ఫుడ్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. దారిపొడవునా తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లతో దాహార్తి తీరుస్తున్నారు. ఈ స్థాయిలో గతంలో ఎన్నడూ ప్రజలు తరలి రాలేదని అభిమానులు చెబుతున్నారు. ప్రజలు భారీగా రావడం రాష్ట్ర చరిత్రలో ఇదే మొదటి సారిగా అభివర్ణిస్తున్నారు. దాదాపు 140 ఎకరాల సభా ప్రాంగణం మొత్తం ప్రజలతో కిక్కిరిసిపోయింది.

## జగన్ పార్టీని జనం పాతిపెట్టారు.. మళ్లీ లేచే పరిస్థితి లేదు

**: ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి**

కడప: వైకాపా హయాంలో నిలిచిపోయిన ఎస్సీ, ఎస్టీ, బీసీల పథకాలు కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ ప్రారంభమయ్యాయని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి అన్నారు. జగన్ పాలనతో రాష్ట్రం పదేళ్లు వెనక్కి వెళ్లిపోయిందని విమర్శించారు. మహానాడు మూడో రోజు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన బహిరంగసభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జగన్ తీరుపై వరదరాజులు రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. "మనది వ్యవసాయ ఆధారిత దేశం. నీటి పారుదల ప్రాజెక్టులతోనే అభివృద్ధి సాధ్యమవుతుంది. కరవు ప్రాంతమైన రాయలసీమకు



ఎన్టీఆర్ సాగునీరు అందించారు. జగన్‌కు వ్యవసాయమంటే చిన్నచూపు. నీటి పారుదల రంగానికి ఆయన చేసిందేమీ లేదు. జగన్‌కు డబ్బుపై ఆశ ఎక్కువ. తండ్రి సంపాదించిన ఆస్తిలో వాటా సోదరికి ఇవ్వలేదు. వాళ్లు కోర్టుకు వెళ్లి పోరాడాల్సిన దుస్థితిని కల్పించారు. ఎన్నికల్లో జగన్ పార్టీని ప్రజలు పాతిపెట్టారు.. వైకాపా మళ్లీ పైకి లేచే పరిస్థితి లేదు. పరిపాలనంటే కేవలం 10 మంది గదుల్లో కూర్చొని మాట్లాడుకోవడం కాదు. మరోసారి ప్రజలు మోసపోతారని జగన్ కలలు కంటున్నారు.. అది ఎన్నటికీ జరగదు. మళ్లీ మోసపోవడానికి జనం సిద్ధంగా లేరు" అని వరదరాజులురెడ్డి అన్నారు.

## గండికోటను అద్భుత పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతాం

**: పెమ్మసాని చంద్రశేఖర్**

గుంటూరు: కడప జిల్లాలోని "గండికోట ను ఒక అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే గండికోటకు సుమారు 78 కోట్ల పర్యాటక శాఖ నిధులను కేటాయించాం." అని గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి తో కలిసి పెమ్మసాని గండికోట ప్రాంతాన్ని గురువారం పరిశీలించారు. శిథిలమైన నిర్మాణాలను, అద్భుతమైన శిల్పకళ నైపుణ్యాన్ని పరిశీలించిన ఆయన ఈ ప్రాంతాన్ని మరో గ్రాండ్ కెన్యాన్ గా పర్యాటక అభివృద్ధి దిశగా నడిపించాలని అన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. "జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి , జమ్మలమడుగు ప్రాంతీయులకు, గండికోట స్థానికులకు ముందుగా నా కృతజ్ఞతలు. శ్రీకృష్ణదేవరాయలు హయాంలో భారతదేశం మొత్తం పై దండయాత్రలు జరిగినా గండికోటను మాత్రం శత్రువులు చేదించలేకపోయారు. దాదాపు 200 ఏళ్లకు పైగా మనవాళ్లు ఈ కోటను, విజయనగర సామ్రాజ్యాన్ని కాపాడారు. అందులో ప్రధాన పాత్ర పోషించిన చీఫ్ కమాండర్ పెమ్మసాని రామలింగ నాయుడు కవచంగా నిలబడ్డారు. 1350 వ సంవత్సరం నుంచి 1550వ సంవత్సరం వరకు అనేకమంది ఈ గండికోటను శత్రు దుర్భేధ్యం గా నిర్మించడంతో పాటు పాలించారు. శ్రీకృష్ణదేవరాయలు అనంతరం ఇక్కడి కట్టడాలు బాగా






పాడు పడ్డాయి. ఇంతటి ఘన చరిత్ర, మన భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉంది. నాతోపాటు ఎన్నారై టీడీపీ సీనియర్ నాయకులు కోమటి జయరాం కూడా ఉన్నారు. మేమిరువురం కలిసి ప్రపంచంలోని ఎన్నో ప్రాంతాలను సందర్శించాము. అమెరికాలోని గ్రాండ్ కెన్యాన్ కూడా ఇలాగే ఉంటుంది. కానీ అక్కడ గ్రాండ్ కెన్యాన్ కి గండికోటలో లాగా నది ప్రవాహం ఉండదు. విజయనగర సామ్రాజ్య యుద్ధాలలో మెలకువలు తెలిసిన సైనికులను తయారు చేయడంలోనూ, సైనిక శిక్షణ ఇవ్వడంలోనూ ఈ ప్రాంతం పేరుగాంచింది. శత్రువు కోట లోపలకు అడుగు పెట్టడానికి వీలు లేకుండా అప్పట్లోనే అద్భుతమైన ఆర్కిటెక్చర్ తో ఈ కట్టడాలు నిర్మించారు. బహుమనీ సుల్తాన్ సైతం కోటలోకి వచ్చేందుకు రెండు మూడు నెలలు ప్రయత్నించి చివరికి చేతగాక విషం పెట్టి గండికోట నాయకులను చంపారు. అప్పుడు మాత్రమే ఈ కోటను చేజిక్కించుకోగలిగారు. ప్రకృతి అద్భుత నిర్మితమైనటువంటి కొండలు ఉన్నటువంటి ఈ ప్రాంతాన్ని అద్భుతంగా అభివృద్ధి చేయవచ్చు. ఈ ప్రాంతం మా పూర్వీకుల కు చెందినది కాబట్టి అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో ఈ ప్రాంత అభివృద్ధి కోసం కృషి చేశాము. కేంద్ర టూరిజం శాఖ మంత్రితో మాట్లాడి సుమారు రూ. 78 కోట్ల నిధులను గండికోట అభివృద్ధి కోసం కేటాయింపు చేసుకున్నామన్నారు. కాంట్రాక్ట్ టెండర్లని తుది దశలో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఎమ్మెల్యే గారు కూడా చొరవ చూపి పనులు త్వరగా పూర్తయ్యేలా చేస్తామని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీకృష్ణదేవరాయలు 100 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని కూడా ప్రకటించారు అని పెమ్మసాని తెలిపారు. కూటమి ప్రభుత్వం రాయలసీమ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, అభివృద్ధికి సహకరిస్తుంది అనడానికి ఇదే నిదర్శనం. జగన్మోహన్ రెడ్డి ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉండి ఈ ప్రాంతానికి అసలు ఏం చేశారు? పర్యాటకపరంగా కూడా కనీసం ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయలేకపోయారు. రాయలసీమ ప్రజలు అందరూ ఇది గుర్తుపెట్టుకుని కూటమి ప్రభుత్వానికి అండగా ఉంటారని ఆశిస్తున్నాను." అని మాట్లాడారు. ఈ పరిశీలనలో స్థానిక టిడిపి, బిజెపి, జనసేన నాయకులు కూడా పాల్గొన్నారు.

## గ్రేడ్ 2 మున్సిపాలిటీలుగా గిద్దలూరు, ఎర్రగుంట్ల

అమరావతి: రాష్ట్రంలో పలు నగర పంచాయతీలు, మున్సిపాలిటీల స్థాయిని పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నగర పంచాయతీలుగా ఉన్న గిద్దలూరు, ఎర్రగుంట్లను గ్రేడ్ 2 మున్సిపాలిటీలుగా.. నరసరావుపేట, ఎమ్మిగనూరు మున్సిపాలిటీలను గ్రేడ్ 1 మున్సిపాలిటీలుగా స్థాయి పెంచుతూ ఆదేశాలు జారీ అయ్యాయి. తక్షణమే ఈ మార్పులు అమల్లోకి వస్తాయని పేర్కొంటూ పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్ నోటిఫికేషన్లను జారీ చేశారు.

## వల్లభనేని వంశీకి బెయిల్ మంజూరు



వైసీపీ నేత , గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ కి గుడ్ న్యూస్ అందింది.

నకిలీ ఇళ్ల పట్టాల కేసులో వంశీకి హైకోర్ట్ బెయిల్ మంజూరు చేసింది. తన అనారోగ్య పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని బెయిల్ మంజూరు చేయాలని వంశీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ పై విచారణ చేపట్టిన ధర్మాసనం.. బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే వంశీకి తక్షణమే వైద్యం అందించాలని అధికారులను ఆదేశించింది. కాగా అక్రమ మైనింగ్ కేసులో కూడా వంశీకి నేడు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది హైకోర్ట్.

## జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు పొడిగింపు




ఏపీ లో జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువుపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అక్రిడిటేషన్ కార్డుల కాల పరిమితిని మరో మూడు నెలలు పాటు పెంచింది. జూన్ 1 నుంచి ఆగస్టు 31 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మే 31 నాటికి అక్రిడిటేషన్ కార్డులు కలిగి ఉన్న పాత్రికేయులకు మాత్రమే మరో మూడు నెలలు ఈ సౌకర్యం వర్తిస్తుందని సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్ల పేర్కొన్నారు.

## రాష్ట్రంలో తొలి కరోనా మరణం!

ఏపీ లో తొలి కరోనా మరణం సంభవించినట్టు సమాచారం. విశాఖపట్నం లో కోవిడ్ లక్షణాలతోపాటు ఇతర అనారోగ్య సమస్యలతో ఓ వ్యక్తి ప్రైవేట్ ఆసుపత్రిలో 3 రోజుల కింద చేరి, చికిత్స పొందుతున్నాడు. అయితే పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ గురువారం ఆసుపత్రిలోకన్నుమూసినట్టు తెలుస్తోంది. ఆసుపత్రి వర్గాల నివేదిక ప్రకారం అతనికి న్యుమోనియా ఎక్కువ కావడంతో ఊపిరితిత్తులు పనిచేయక మృతి చెందాడని పేర్కొన్నారు. కాగా ఈ మరణంపై జిల్లా వైద్యాధికారులు విచారణ జరుపుతున్నట్టు సమాచారం. కాగా దేశంలో కరోనా రోజురోజుకీ వేగంగా



పెరుగుతున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బహిరంగ ప్రదేశాలలో మాస్కులు ధరించాలని అధికారులు సూచిస్తున్నారు. కాగా కరోనాతో వ్యక్తి మృతి చెందడంతో విశాఖ వాసులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

## లాభాల్లోకి స్టాక్ మార్కెట్లు..
## సెన్సెక్స్ 320 పాయింట్లు జంప్..



దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల పవనాలతో మార్కెట్లు లాభాల్లో మొదలయ్యాయి. ఆ తర్వాత మార్కెట్లు ఒడిదొడుకులను ఎదుర్కొన్నాయి. చివరి సెషన్‌లో పుంజుకున్నాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 81,591.03 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 81,106.98 పాయింట్ల కనిష్టానికి చేరిన సెన్సెక్స్.. అత్యధికంగా 81,816.89 పాయింట్ల గరిష్టానికి చేరింది. చివరకు 320.70 పాయింట్లు పెరిగి.. 81,633.02 వద్ద ముగిసింది. నిఫ్టీ 81.15 పాయింట్లు పెరిగి 24,833.60 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో దాదాపు 1,751 షేర్లు లాభపడగా.. 1,748 షేర్లు పతనమయ్యాయి.

నిఫ్టీలో ఇండస్‌ఇండ్ బ్యాంక్, సన్‌ఫార్మా, అదానీ పోర్ట్స్, ఎక్స్‌టర్నల్, ట్రెంట్, టెక్ మహీంద్రా, టాటా స్టీల్, విప్రో, అదానీ ఎంటర్‌ప్రైజెస్, ఐచర్ మోటార్స్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సురెన్స్ లాభాల్లో కొనసాగగా.. హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్, భారత్ ఎలక్ట్రికల్, జియో ఫైనాన్షియల్, బజాజ్ ఫైనాన్స్, శ్రీరామ్ ఫైన్సాన్స్, అపోలో హాస్పిటల్స్, ఏషియన్ పేయింట్స్ తదితర షేర్లు నష్టపోయాయి. నిఫ్టీ రియాల్టీ 1.2 శాతం పెరిగింది. మెటల్ .08శాతం, ఐటీ, ఫార్మా 0.5శాతం వృద్ధిని నమోదు చేశాయి. పీఎస్‌యూ బ్యాంక్ 0.8శాతం తగ్గింది. ఎఫ్ఎంసీజీ 0.6శాతం పతనమైంది. కిక్‌బ్యాక్‌లను పద్ధతి ప్రకారం సెటిల్ చేయడానికి ఫ్రంట్ కంపెనీల ద్వారా లావాదేవీలు జరిపినట్లు ఆధారాలు లభించాయని ఈడీ తెలిపింది. ఈ కేసులో ప్రధాన ప్రమోటర్ సంజయ్ సురేఖను ఈడీ డిసెంబర్ 2024లో అరెస్ట్ చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో కోల్‌కతా కోర్టులో అతనిపై ఛార్జిషీట్ దాఖలు చేసింది. సంజయ్ సురేఖ, CSPLలకు సంబంధించిన రూ. 510 కోట్ల విలువైన ఆస్తులను PMLA చట్టం కింద జారీ చేసిన రెండు ఆదేశాల ద్వారా ఈడీ ఇప్పటికే అటాచ్ చేసింది. ఈ ఆరోపణలపై సుబోధ్ కుమార్ గోయెల్ లేదా ఆయన తరపు న్యాయవాది నుండి ఎలాంటి స్పందన రాలేదు.

## 26 వేల కోట్ల రుణాలు రైటాఫ్..

### బ్యాలెన్స్ షీట్స్ నుంచి తొలగించిన ఎస్బీఐ




ప్రభుత్వరంగ బ్యాంకుల తోపాటు ప్రైవేట్ బ్యాంకులు భారీ స్థాయిలో రుణాలను రైటాఫ్ చేశాయి. గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను ప్రభుత్వరంగ బ్యాంకుల కన్నా ప్రైవేట్ రంగ బ్యాంకులు అన్ సెక్యూర్డ్ రుణాలను పెద్దమొత్తంలో రైటాఫ్ చేశాయి. వీటిలో దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) అత్యధికంగా రూ.26 వేల కోట్లకు పైగా రుణాలను తన బ్యాలెన్స్ షీట్స్ నుంచి తీసివేసింది. అంతక్రితం ఏడాది రైటాఫ్ చేసిన రూ.17,645 కోట్లతో పోలిస్తే ఇంచుమించు రూ.10 వేల కోట్లకు పెరిగాయి. ప్రభుత్వరంగ బ్యాంకులతో పోలిస్తే ప్రైవేట్ బ్యాంకులు అధిక మొత్తంలో రుణాలను రైటాఫ్ చేయడం విశేషం. గతేడాది ఐసీఐసీఐ బ్యాంక్ రూ.9,271 కోట్ల రుణాలను తన ఖాతా పుస్తకం నుంచి తొలగించింది. 2023-24లో రైటాఫ్ చేసిన రూ.6,091 కోట్ల కంటే ఇది 50 శాతం అధికం. అలాగే యాక్సిస్ బ్యాంక్ కూడా రూ.11,833 కోట్ల మొండి బకాయిలను తన ఖాతాలోంచి తీసివేసింది.

#### ఎంఎస్ఎంఈ, వ్యవసాయ రుణాలే..

చిన్నస్థాయి రుణాలు తీసుకొని ఎగ్గొట్టే వారు అధికంగా ఉంటున్నారని రిజర్వుబ్యాంక్ ఆందోళన వ్యక్తంచేసింది. వీటిలో ఎంఎస్ఎంఈ, వ్యవసాయ రంగాల్లో అత్యధికంగా ఉంటున్నాయని, వీటిని తగ్గించడానికి బ్యాంకులు పెద్దగా చర్యలు తీసుకోవడం లేదని హెచ్చరిస్తున్నది. పూచీకత్తు లేకుండా బ్యాంకులు, ఆర్థిక సంస్థలు రుణాలు ఇస్తున్నాయని, వీటి వల్ల ఆయా సంస్థల ఆర్థిక స్థితిగతులపై ప్రతికూల ప్రభావం పడనున్నదని గతంలోనే రిజర్వు బ్యాంక్ హెచ్చరించింది. అయినప్పటికీ బ్యాంకులు రుణాలు ఇవ్వడం మానడం లేదు. కఠిన నిబంధనలు విధించడం వల్ల బ్యాంకుల రుణ వితరణకు బ్రేక్‌లు వేయవచ్చునని, దీనివల్ల చిన్న వ్యాపారాలు, వ్యక్తులు, రుణాలు పొందడం కష్టతరంకానున్నది. అయినప్పటికీ గడిచిన మూడేండ్లలో రైటాఫ్ అయిన రుణాల్లో 20 శాతం రికవరి కావడం విశేషం.



### క్వాలిఫయర్ -1లో వన్ సైడ్ షో
### - పంజాబ్ కింగ్స్ ను 8 వికెట్ల తేడాతో చిత్తు చేసిన ఆర్సీబీ

# ఐపీఎల్-2025 ఫైనల్లోకి దూసుకెళ్లిన ఆర్సీబీ..



చండీగర్: ఐపీఎల్ 2025 సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) జట్టు ఫైనల్లోకి దూసుకెళ్లింది. పూర్తి ఏకపక్షంగా సాగిన క్వాలిఫయర్-1 మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్‌పై ఆర్సీబీ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో బెంగళూరు జట్టు నేరుగా ఫైనల్ పోరుకు అర్హత సాధించగా, పంజాబ్ కింగ్స్ ఫైనల్ చేరేందుకు క్వాలిఫయర్-2లో ఆడాల్సిన పరిస్థితి ఏర్పడింది. చండీగర్‌లోని ముల్లన్‌పూర్ మహారాజా యదవీంద్ర సింగ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో నేడు జరిగిన మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) అద్భుత ప్రదర్శన కనబరిచింది. టాస్ గెలిచిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కెప్టెన్ రజత్ పటీదార్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. కెప్టెన్ నమ్మకాన్ని నిలబెడుతూ ఆర్సీబీ బౌలర్లు ఆది నుంచే పంజాబ్ బ్యాటర్లపై నిప్పులు చెరిగారు. పంజాబ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లు కూడా ఆడలేక పోయింది. కేవలం 14.1 ఓవర్లలో 101 పరుగులకే ఆలౌట్ అయింది. స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన రాయల్



ఛాలెం జర్స్ బెంగళూరుకు ఓపెనర్ ఫిలిప్ సాల్ట్ అద్భుతమైన ఆరంభాన్నిచ్చాడు. సాల్ట్ కేవలం 27 బంతుల్లోనే 6 ఫోర్లు, 3 సిక్సర్లతో అజేయంగా 56 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. విరాట్ కోహ్లీ (12 బంతుల్లో 12బీ 2 ఫోర్లు) త్వరగానే ఔటైనా, ఆ తర్వాత వచ్చిన మయాంక్ అగర్వాల్ (13 బంతుల్లో 19బీ 2 ఫోర్లు, 1 సిక్సర్) దూకుడుగా ఆడాడు. చివర్లో కెప్టెన్ రజత్ పటీదార్ (8 బంతుల్లో 15 నాటౌట్‌బీ 1 ఫోర్, 1 సిక్సర్) సాల్ట్‌తో కలిసి లాంఛనాన్ని పూర్తి చేశాడు. ఆర్సీబీ కేవలం 10 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 106 పరుగులు చేసి ఘన విజయాన్ని అందుకుంది. పంజాబ్ బౌలర్లలో జేమీసన్, ముషీర్ ఖాన్ చెరో వికెట్ తీశారు. పవర్ ప్లేలో ఆర్సీబీ 61 పరుగులు చేసింది. టోర్నీలో ఫైనల్ మ్యాచ్ జూన్ 3న జరగనుంది. రేపు గుజరాత్ టైటాన్స్, ముంబయి ఇండియన్స్ మధ్య ఎలిమినేటర్ మ్యాచ్ జరగనుంది. ఇందులో గెలిచిన జట్టు క్వాలిఫయర్-2లో పంజాబ్ కింగ్స్ తో తలపడాల్సి ఉంటుంది. క్వాలిఫయర్-2 మ్యాచ్ జూన్ 1న జరగ నుంది.

క్వాలి ఫయర్-2లో నెగ్గిన జట్టు ఫైనల్లో ఆర్సీబీతో ఆడుతుంది.

# ఐపీఎల్ నుంచి భారీ విజయంతో నిష్క్రమించిన ధోనీ సేన





గుజరాత్ టైటాన్స్‌జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ జట్టు ఘన విజయం సాధించింది. 83 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. 231 పరుగుల లక్ష్యఛేదనలో 147 పరుగుల వద్ద గుజరాత్ జట్టు ఆలౌటైంది. సీజన్ చివరి మ్యాచ్ కావడంతో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ప్రారంభించిన చెన్నై బ్యాటర్లు చెలరేగారు. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 230 పరుగులు చేశారు. ఆయుష్ మాత్రే (34), కాన్వే (52), ఉర్విల్ పటేల్ (37), శివమ్ దూబె (17), డెవాల్డ్ బ్రెవిస్ (57), రవీంద్ర జడేజా (21) రాణించారు. గుజరాత్ బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ 2 వికెట్లు.. సాయి కిశోర్, రషీద్ ఖాన్, షారుక్ ఖాన్ తలో వికెట్ పడగొట్టారు.

ఇక 231 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టైటాన్స్ జట్టు.. 18.3 ఓవర్లలో 147 పరుగులకు ఆలౌటయ్యింది. ఓపెనర్ సాయి సుదర్శన్ (41) తప్ప.. మిగతా వారెవరూ పెద్దగా రాణించలేదు. చివర్లో అర్షద్ ఖాన్ (20) ఫర్వాలేదనిపించాడు. నూర్ అహ్మద్, కాంబోజ్ చెరో 3 వికెట్లు పడగొట్టగా.. రవీంద్ర జడేజా, 2 వికెట్లు, ఖలీల్ అహ్మద్, పతిరణ చెరో వికెట్ తీశారు.

## స్పిరిట్ మూవీలో త్రిప్తి దిమ్రి ప్లే చేయనున్న పాత్ర ఏంటో తెలుసా..

అస్సలు ఊహించ లేరుగా..



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న వరుస బిగ్గెస్ట్ ప్రాజెక్టులలో 'స్పిరిట్' ఒకటి. సందీప్ రెడ్డి వంగడైరెక్షన్‌లో రాబోతున్న ఈ చిత్రం పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రాన్ని ఎప్పుడెప్పుడు బిగ్ స్క్రీన్‌పై చూస్తామా అంటూ సినీ ప్రియులతో పాటు డార్లింగ్ ఫ్యాన్స్ కూడా ఎంతో ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు. అయితే ఇందులో హీరోయిన్‌గా త్రిప్తి దిమ్రి హీరోయిన్‌గా నటించనున్నట్లు రీసెంట్‌గా అఫీషియల్‌గా ప్రకటించిన సంగతి తెలిసిందే.దీంతో యానిమల్ సమయంలో ఏ రేంజ్‌లో ఫేమ్ తెచ్చుకుందో ఈ ముద్దుగుమ్మ మరోసారి ఈ అనౌన్స్మెంట్ తోనే మరింత పాపులర్ అయింది. ఈ క్రమంలో ఈ చిత్రా నికి సం బంధిం చిన ఓ న్యూస్ నెట్టింట చక్కర్లు కొడు తోంది.



స్పిరిట్ సినిమాలో ప్రభాస్ పోలీస్ పాత్రలో కనిపిం చనున్న సంగతి తెలిసిందే. అయితే త్రిప్తి దిమ్రి మాత్రం డాక్టర్ పాత్రలో కనిపించనుందని సమాచారం. డాక్టర్ పోలీస్ మధ్య రొమాన్స్ సీన్స్ కూడా బానే ఉన్నాయట. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన న్యూస్ నెట్టింట వైరల్‌గా మారగా.. డార్లింగ్ ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు.

## త్రివిక్రమ్-వెంకటేష్ కాంబో వర్కౌట్ అవుతుందా..



ఇప్పటి వరకు తెలుగు సినిమా ఇండస్ట్రీ లో ఎవ్వరికి లేనటువంటి గొప్ప గుర్తింపును సంపాదించుకున్న హీరోలు చాలా మంది ఉన్నప్పటికి తమదైన రీతిలో సత్తా చాటుకుంటూ ముందుకు దూసుకెళ్తున్న స్టార్ హీరోలు చాలా మంది ఉన్నారనే చెప్పాలి ఇక దర్శకులు సైతం పాన్ ఇండియాలో భారీ మార్కెట్ ను క్రియేట్ చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. కామెడీ సినిమాలతో తనకంటూ ఒక ప్రత్యేకమైన ఇమేజ్ ను సంపాదించుకున్న నటుడు వెంకటేష్ ఫ్యామిలీ సినిమాలతో పాటు, మాస్ సినిమాలను చేస్తూ ప్రేక్షకులను అలరిస్తూ వచ్చాడు. కానీ ఇప్పుడు మాత్రం అన్ని రకాల జానర్స్ లో సినిమాలను చేస్తూ తనకంటూ ఒక ఐడెంటిటిని క్రియేట్ చేసుకోవాలనే ప్రయత్నంలో ఉన్నట్టుగా తెలుస్తోంది. ఇక ఇప్పటికే ఆయన చేసిన సినిమాలు అతన్ని చాలా గొప్ప స్థానంలో నిల్చోబెట్టాయి. ఇప్పటివరకు ఆయన చేసిన సినిమాలు ఒకెత్తయితే ఇప్పుడు చేయబోతున్న సినిమాలు మరొక ఎత్తుగా మారిపోతున్నాయి. ఇక రీసెంట్ గా సంక్రాంతి కానుకగా 'సంక్రాంతి వస్తున్నాం' అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయాన్ని సాధించాడు. 300 కోట్ల కలెక్షన్స్ ను కొల్లగొట్టి ఈ సినిమా వెంకటేష్ కి భారీ ఇమేజ్ ను తీసుకురావడమే కాకుండా ఆయనకంటూ లో ఒక ప్రత్యేకమైన ఐడెంటిటిని క్రియేట్ చేసింది. ఇక ఇప్పుడు ఆయన చేస్తున్న ప్రతి సినిమాలో ఏదో ఒక వైవిధ్యమైన కథాంశం అయితే ఉంటుంది. ఇప్పుడు త్రివిక్రమ్ తో చేయబోతున్న సినిమాలో సైతం ఒక ప్రత్యేకమైన



ఐడెంటిటిని క్రియేట్ చేసి పెట్టాలనే ప్రయత్నం చేస్తున్నాడు. ఇప్పటికే మాటల మాంత్రికుడిగా మంచి గుర్తింపును సంపాదించుకున్న త్రివిక్రమ్ వరుస సక్సెస్ లను సాధిస్తూ ముందుకు దూసుకెళు తున్నాడు. వెంకటేష్‌తో చేస్తున్న సినిమాతో పాన్ ఇండియాలో సైతం భారీ మార్కెట్ ను క్రియేట్ చేసుకొని తనకంటూ ఒక స్పెషల్ ఐడెంటిటిని క్రియేట్ చేసుకోవాలనే ప్రయత్నం చేస్తున్నట్టుగా తెలుస్తోంది. ఇప్పటివరకు ఆయన సాధించిన విజ యాలు అతన్ని చాలా ఉన్నతమైన స్థానంలో నిలిపాయి.

## రామాయణం యాక్షన్ సీన్స్

### హాలీవుడ్ స్టంట్ డైరెక్టర్ గై నోరిస్ ఎంటర్



భారతీయ సినీ ప్రపంచంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న ఇతిహాసిక చిత్రం 'రామాయణం' . ప్రముఖ నటుడు, నిర్మాత రాకింగ్ స్టార్ యశ్ ఈ భారీ ప్రాజెక్టులో రావణుని పాత్రలో కనిపించబోతుండగా, రాముడిగా రణబీర్ సింగ్, సీతగా సాయి పల్లవి నటిస్తున్నారు. ఈ సినిమా కోసం హాలీవుడ్‌కు చెందిన ప్రఖ్యాత స్టంట్ డైరెక్టర్ గై నోరిస్ యాక్షన్ సీన్స్ చిత్రీకరిస్తున్నారు. గై నోరిస్ గతంలో 'మాడ్ మ్యాక్స్: ఫ్యూరీ రోడ్', 'ది సుసైడ్ స్క్వాడ్' వంటి హాలీవుడ్ బ్లాక్‌బస్టర్ చిత్రాలకు స్టంట్ కొరియోగ్రఫీ చేశారు. ఇప్పుడు ఆయన 'రామాయణం' కోసం ప్రత్యేకంగా భారతదేశానికి వచ్చి యాక్షన్ సన్నివేశాల రూపకల్పనలో నిమగ్నమయ్యారు. ఈ చిత్రం, భారతీయ పౌరాణిక గాథను ప్రపంచస్థాయిలో ఆవిష్కరించేందుకు రూపుదిద్దుకుంటోంది. యశ్ ఈ సినిమాలో నటుడిగా మాత్రమే కాకుండా సహనిర్మాతగా కూడా వ్యవహరిస్తున్నారు. తాజాగా మేకర్స్ యాక్షన్ సన్నివేశాలకు సంబంధించిన చిత్రీకరణ ఫోటోలను విడుదల చేశారు. ఈ చిత్రాన్ని నితేష్ తివారీ డైరెక్ట్ చేస్తుండగా, నమిత్ మల్హోత్రాతో కలిసి యశ్ నిర్మిస్తున్నాడు. ఈ సినిమా మొదటి భాగం వచ్చే యేడాది దీపావళికి విడుదల కానుంది. రెండో భాగాన్ని 2027 దీపావళికి విడుదల చేస్తారు.

## రాఘవ లారెన్స్ సినిమాలో హీరోయిన్‌గా యంగ్ బ్యూటీ..



మల్టీ టాలెంటెడ్‌గా తనకంటూ స్పెషల్ గుర్తింపు తెచ్చుకున్న రాఘవా లారెన్స్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా నుంచి.. ఫస్ట్ లుక్ పోస్టర్స్ తప్ప మరో అప్‌డేట్ రాలేదు. దీంతో ఈ సినిమా నుంచి వచ్చే అప్‌డేట్స్ కోసం లారెన్స్ ఫ్యాన్స్ ఎంతో ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు. ఇందులో భాగంగానే రీసెంట్‌గా ఫేమస్ నటుడు నివిన్ పౌలీ నటిస్తున్నట్లు తెలిపారు.ఇప్పుడు ఈ చిత్రంలో హీరోయిన్‌కు సంబంధించిన వార్తలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. యంగ్ బ్యూటీ సంయుక్తను హీరోయిన్‌గా ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. అంతే కాకుండా.. ఇప్పటికే సంయుక్తకు కథ కూడా చెప్పగా ఓకే చేసేసిందట. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన న్యూస్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. రాఘవ లారెన్స్ సరసన సంయుక్త హీరోయిన్‌గా అంటే.. వీరిద్దరి కాంబో ఏ రేంజ్‌లో ఉంటుందో బిగ్ స్క్రీన్‌పై చూడాల్సిందే అంటూ కామెంట్స్ చేస్తున్నారు నెటిజన్లు.

## గద్దర్ అవార్డుల ప్రకటన

- ఉత్తమ చిత్రంగా కల్కి మూవీ
- ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్
- ఉత్తమ నటిగా నివేదా థామస్
- ఉత్తమ గాయనిగా శ్రేయా ఘోషాల్
- అవార్డుల వివరాలు ప్రకటించిన జయసుధ, దిల్‌రాజ్









గద్దర్ అవార్డుల విభాగంలో ఉత్తమ చిత్రంగా కల్కి, ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్, ఉత్తమ నటిగా నివేదా థామస్, ఉత్తమగాయనిగా శ్రేయా ఘోషల్ ఎంపికలయ్యారు. తెలంగాణ ప్రభుత్వం గద్దర్ అవార్డులను ప్రకటించింది. ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజుతో కలిసి జ్యూరీ చైర్‌పర్సన్ జయసుధ మీడియా సమావేశంలో 2024కు సంబంధించిన అవార్డులను ప్రకటించారు. మొత్తం 1248 నామినేషన్లను పరిశీలించిన కమిటీ విజేతలను ఎంపిక చేసింది. తెలంగాణ యుద్ధ నౌక, దివంగత ఉద్యమ నేత గద్దర్



పేరు మీద.. సినీ రంగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ఈ అవార్డులు ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. గతంలో ఉన్న నంది అవార్డుల స్థానంలో గద్దర్ అవార్డులను ఇవ్వాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా తొలి సారి గద్దర్ అవార్డులు అందజేయనున్నారు. ఉత్తమ నటుడిగా అల్లుఅర్జున్, ఉత్తమ చిత్రంగా కల్కి సినిమాను కమిటీ ఎంపిక చేసింది. ప్రముఖ నటి జయసుధ నేతృత్వంలో సినీ అవార్డుల జూరి ఏర్పాటు- అయ్యింది. ఈ క్రమంలో గురువారం ఉదయం గద్దర్ తెలంగాణ సినిమా అవార్డుల వివరాలను అవార్డుల కమిటీ- చైర్మన్ జయసుధ ప్రకటించారు. దాదాపు 14 ఏళ్ల తర్వాత ప్రభుత్వం అవార్డులను ఇవ్వబోతోందని ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు అన్నారు. ఎలాంటి ఒత్తిళ్లు, ప్రలోభాలు లేకుండా పారదర్శకంగా అవార్డులను ఎంపిక చేశామని జయసుధ చెప్పారు. అవార్డులు తమకు బూస్ట్ ఇస్తాయని.. ప్రభుత్వం తమకు ఫుల్ ఫ్రీడమ్ ఇచ్చిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , భట్టి విక్రమార్క , కోమటిరెడ్డి , దిల్ రాజుకు ధన్యవాదాలు తెలియజేశారు. 14 ఏళ్ల అనంతరం అవార్డులు ఇవ్వటం సంతోషమన్నారు. బెస్ట్ ఆఫ్ బెస్ట్ కే అవార్డులు వస్తున్నాయని అన్నారు. జూన్ 14న హైటెక్స్‌లో అవార్డుల ప్రదా నం జరుగుతుందన్నారు. అలాగే 2014-23 సంవత్స రాలకు సంబంధించిన అవార్డులను త్వరలో ప్రకటిస్తామన్న జ్యూరీ చైర్‌పర్సన్ జయసుధ వెల్లడించారు.

గద్దర్ అవార్డులు దక్కిన వివరాలు ఇలా ఉన్నాయి.

- ఉత్తమ చిత్రం - కల్కి
- ఉత్తమ రెండో చిత్రం - పొట్టేల్
- ఉత్తమ మూడో చిత్రం - లక్కీభాస్కర్
- ఉత్తమ నటుడు - అల్లు అర్జున్ (పుష్ప-2)
- ఉత్తమ నటి - నివేదా థామస్ (35 చిన్న కథకాదు)
- ఉత్తమ డైరెక్టర్ - నాగ్ అశ్విన్ (కల్కి)
- ఉత్తమ సహాయ నటుడు - ఎస్‌జే సూర్య (సరిపోదా శనివారం)
- ఉత్తమ సహాయ నటి - శరణ్య ప్రదీప్ (అంబాజీపేట మ్యారేజ్‌బ్యాండ్)
- ఉత్తమ హాస్యనటుడు - సత్య, వెన్నెల కిషోర్ (మత్తు వదలరా)
- ఉత్తమ సంగీత దర్శకుడు - భీమ్స్ (రజాకార్)
- ఉత్తమ స్టోరీ రైటర్ - శివ పాలడుగు
- ఉత్తమ స్క్రీన్ ప్లే - వెంకీ అట్లూరి (లక్కీ భాస్కర్)
- ఉత్తమ గాయకుడు - సిద్ధ్ శ్రీరామ్ (ఊరుపేరు భైరవకోన)
- ఉత్తమ గాయని - శ్రేయా ఘోషల్ (పుష్ప-2)
- ఉత్తమ కొరియోగ్రాఫర్ - గణేష్ ఆచార్య (దేవ)
- స్పెషల్ జ్యూరీ అవార్డు - దుల్కర్ సల్మాన్ (లక్కీభాస్కర్)
- స్పెషల్ జ్యూరీ అవార్డు - అనన్య నాగళ్ల (పొట్టేల్)
- బెస్ట్ డెబ్యూ ఫిల్మ్ డైరెక్టర్ - యధువంశీ (కమిటీ- కుర్రాళ్లు)
- 2024 ఉత్తమ బాలల చిత్రం - 35 చిన్న కథకాదు
- బెస్ట్ ఎన్విరాన్‌మెంట్ - హెరిటేజ్-హిస్టరీ విభాగం - రజాకార్
- నేషనల్ ఇంటెగ్రిటీ- సోషల్ అప్‌లిఫ్ట్ విభాగం - కమిటీ- కుర్రాళ్లు

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.